

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 22-01-2025 | సంపుటి - 21 సంచిక -274 రూ : 4 | పేజీలు: 8




## రాజ్యాంగంతోనే
# అన్నివర్గాలకు సమ ప్రాధాన్యం

- బెళగావి 'సంవిధాన్ సభ'లో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు, ఎంపీలు

హైదరాబాద్ : స్వాతంత్ర్యోద్యమ సమయంలో కర్ణాటకలోని బెళగావిలో జరిగిన ఏఐసీసీ సమావేశానికి గాంధీ మహాత్మాగాంధీ అధ్యక్షత వహించి వందేళ్లు అవుతోంది. ఆ సందర్భాన్ని, దేశానికి గాంధీ, డా.బీఆర్ అంబేద్కర్‌లు చేసిన సేవలను గుర్తు చేసుకోవడంతోపాటు రాజ్యాంగాన్ని పరిరక్షించాలన్న పిలుపుతో కాంగ్రెస్ పార్టీ బెళగావిలో మంగళవారం 'జై బాపు... జై భీమ్... జై సంవిధాన్' అనే కార్యక్రమాన్ని చేపట్టింది. అక్కడ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శన, అనంతరం నిర్వహించిన సభకు తెలంగాణ రాష్ట్ర మంత్రులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావుతోపాటు పలువురు

తరువాయి 2లో

## ప్రజల త్యాగాలతోనే
# రాజ్యాంగ రక్షణ..

- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా పిలుపు




బెంగళూరు: మౌలిక హక్కులు, అధికారాలకు మూలమైన రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు దేశ ప్రజలు ప్రాణత్యాగానికైనా సిద్ధంగా ఉండాలని ఏఐసీసీ ప్రధానకార్యదర్శి, ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా పిలుపునిచ్చారు. కర్ణాటకలోని బెళగావిలో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ జాతీయ సమ్మేళన శతమానోత్సవ స్మరణ కార్యక్రమం 'జై బాపు, జై భీమ్, జై రాజ్యాంగం' వేదికపై ఆమె మాట్లాడారు. రాజ్యాంగాన్ని, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానిస్తున్న విధానాలను సహించరాదని ఆమె సూచించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులోనే అంబేద్కర్‌ను అవమానించారని మండిపడ్డారు. ఇలాంటి ప్రభుత్వాన్ని, మంత్రిని గతంలో ఎన్నడూ చూడలేదని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సైతం తొలిసారి అధికారానికి వచ్చినప్పుడు రాజ్యాంగాన్ని విమర్శించటం మొదలుపెట్టారని తప్పుబట్టారు. 'రాహుల్‌గాంధీ నిత్యం రాజ్యాంగ రక్షణకు శ్రమిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన తెగువను చూసి భాజపా

తరువాయి 2లో

## గ్రీన్‌ఫీల్డ్ సాధ్యం కానిచోట
# బ్రౌన్‌ఫీల్డ్ రహదారుల అభివృద్ధి!

- ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య 11 రేడియల్ రోడ్లపై ప్రభుత్వం కసరత్తు



హైదరాబాద్: ప్రాంతీయ వలయ రహదారి (ఆర్ఆర్ఆర్), బాహ్య వలయ రహదారి (ఓఆర్ఆర్) మధ్య 11 రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ రోడ్లను.. భూసేకరణ చేసి కొత్తగా (గ్రీన్‌ఫీల్డ్) నిర్మించాలని అనుకున్నా, వివిధ సమస్యల నేపథ్యంలో.. అవకాశం ఉన్నచోట పాత రహదారులనే (బ్రౌన్‌ఫీల్డ్) రేడియల్ రోడ్లుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇటీవల ఈ అంశంపై సమీక్షించిన ముఖ్యమంత్రి.. ఈ మేరకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం.

**ఇబ్బందులు ఇలా..**

ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్లకు మధ్యలో కొన్నిచోట్ల గ్రామాలు, పట్టణాలు రావడం, మరికొన్ని చోట్ల భూసేకరణలో ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉండడం, రహదారుల డిజైన్‌లో సాంకేతిక సమస్యలు వస్తుండడాన్ని అధికారులు ప్రస్తావిస్తున్నారు. ఇప్పటికే జాతీయ రహదారులు, ఓఆర్ఆర్, పరిశ్రమల అభివృద్ధికి పెద్ద ఎత్తున భూసేకరణ చేపట్టారు. మళ్లీ కొన్నిచోట్ల భూసేకరణ

తరువాయి 2లో

## ఆసుపత్రి నుంచి
# ఇంటికి సైఫ్

- పట్టు విడిపించుకునేందుకే ఆయనను పొడిచా
- విచారణలో నిందితుడి వెల్లడి

2లో





## ఈ ఏడాది పెరిగిన
# సంక్రాంతి ప్రయాణాలు

- ముందు జాగ్రత్తలతో తగ్గిన ట్రాఫిక్ ఇబ్బందులు

చౌటుప్పల్ గ్రామీణం: తెలుగు రాష్ట్రాల్లో గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం సంక్రాంతి ప్రయాణాలు పెరిగాయి. గత పది రోజుల్లో జాతీయ రహదారులపై సాధారణం కన్నా రెట్టింపు సంఖ్యలో వాహనాలు ప్రయాణించాయి. అయితే ముందు జాగ్రత్తలు తీసుకోవడంతో ట్రాఫిక్ సమస్య తగ్గింది. ముఖ్యంగా హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం పంతంగి, కేతేపల్లి మండలం కొర్లపహాడ్‌లతో పాటు హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారిపై బీబీనగర్ మండలం గూడురు టోల్ ప్లాజాలు ఉన్నాయి. ఈ టోల్‌ప్లాజాల వద్ద వాహనాల రద్దీ అధికంగానే ఉన్నా..వాహనాల ఫాస్టాగ్‌ను రెండు, మూడు సెకన్లలో స్కాన్ చేయడంతో పాటు రాచకొండ పోలీసుల ముందస్తు చర్యలతో గతంతో

తరువాయి 2లో



## 7.25 లక్షల మంది
# భారతీయుల్లో వణుకు


- ట్రంప్ ఆంక్షలు అమలైతే తిరుగుముఖమే
- జన్మతః వచ్చే పౌరసత్వం రద్దుతో సంకటం

వాషింగ్టన్: అక్రమంగా అమెరికాకు వలస వచ్చిన వారిని తిరుగుటపాలో పంపించేయక తప్పదని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన కొన్ని లక్షలమందిలో గుబులు రేకెత్తిస్తోంది. గడ్డ కట్టిస్తున్న చలి కంటే ఇది వారిని ఎక్కువగా వణికిస్తోంది. తాత్కాలిక వీసాలపై వచ్చినవారిదీ ఇదే పరిస్థితి. సరైన పత్రాల్లేకుండా అమెరికాలో నివసిస్తున్న వారు దాదాపు 1.40 కోట్లమంది ఉంటారని అంచనా. వీరిలో భారతీయులు సుమారు 7.25 లక్షల మంది. మెక్సికో, సాల్వెడార్ ప్రజల తర్వాత ఎక్కువగా ఉన్నది భారతీయులే. ఎన్నికల ప్రచారం నుంచి ఇలాంటివారి విషయంలో పదేపదే తన వైఖరిని ట్రంప్ చెబుతూ వచ్చారు. బాధ్యతలు

తరువాయి 2లో

## బాంబే హైకోర్టు సీజేగా
# ఆలోక్ అరాధే ప్రమాణం

ముంబయి: తెలంగాణ హైకోర్టునుంచి బదిలీ అయిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే మంగళవారం బాంబే హైకోర్టు సీజేగా ప్రమాణం చేశారు. ముంబయిలోని రాజ్‌భవన్ దర్బార్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో మహారాష్ట్ర గవర్నర్ సి.పి. రాధాకృష్ణన్ ఆయనతో ప్రమాణం చేయించారు.



# మావోయిస్టు అగ్రనేత చలపతి మృతి



- ఛత్తీస్‌గఢ్-ఒడిశా రాష్ట్రాల సరిహద్దుల్లో భారీ ఎన్‌కౌంటర్..
- 24 మంది మావోయిస్టుల మృతి!
- 15 మృతదేహాల స్వాధీనం
- మృతుల్లో ఇద్దరు మహిళలు

హైదరాబాద్, అమరావతి చర్ల, చిత్తూరు, తవణంపల్లె, రాయచోటి : మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌ఒడిశా సరిహద్దుల్లోని గరియాబంద్ జిల్లా కుల్హాడీఘాట్ అటవీ ప్రాంతంలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి ప్రతాప్‌రెడ్డి అలియాస్ చలపతి అలియాస్ జయరాం (62) మృతి చెందాడు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలం ముత్యంపైపల్లెకు చెందిన ఆయనపై రూ.కోటి రివార్డుంది. ఈ ఎన్‌కౌంటర్‌లో మొత్తం 24 మంది మరణించినట్లు విశ్వసనీయ సమాచారం. 15 మంది మృతదేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మృతుల్లో 8 మందిని గుర్తించారు. చనిపోయిన వారిలో చలపతితో పాటు ఒడిశాలో మావోయిస్టు పార్టీ కీలక నేత మనోజ్, స్పెషల్ జోనల్ కమిటీ (ఎస్‌జడ్‌సీ) సభ్యుడు గుడ్డూ ఉన్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ సాధ్యం కానిచోట బ్రౌన్‌ఫీల్డ్ రహదారుల అభివృద్ధి!

(మొదటిపేజీ తరువాయి)

అంటే స్థానికుల నుంచి ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అవకాశం ఉన్నచోట.. బ్రౌన్‌ఫీల్డ్ రహదారులను అనుసంధానం చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది.

*** సుమారు 300 కి.మీ.కు పైగానే..**

ఈ 11 రేడియల్ రహదారుల మొత్తం పొడవు 300 కి.మీ.కుపైగానే ఉండనుంది. దీని కోసం వెయ్యి ఎకరాలకుపైగా భూసేకరణ చేయాల్సి ఉంటుందని అంచనా. మధ్యలో అటవీ భూము లున్నాయి. ఓఆర్ఆర్ ఎగ్జిట్ 2, 4, 8, 10, 13, 15 నంబర్లతోపాటు ఇతర ప్రాంతాల నుంచి గ్రీన్‌ఫీల్డ్ రోడ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం ఆదేశాలతో ఇప్పటికే కొన్నిచోట్ల భూసేకరణ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి (161.59 కి.మీ.) ఎన్‌హెచ్‌ఏఐ ఇటీవలే టెండర్లు పిలిచింది. 189 కి.మీ. దక్షిణ భాగం నిర్మాణానికి డీపీఆర్ రూపకల్పనకు కన్సల్టెన్సీ సంస్థ కోసం రాష్ట్ర ప్రభుత్వం రెండోసారి టెండర్లు పిలిచింది. ఈ భాగాన్నీ నిర్మించడానికి కేంద్రం ఆసక్తిగా ఉంది. దీనిపై స్పష్టత వచ్చేలోపు రేడియల్ రోడ్లను పూర్తి చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. ఆర్ఆర్ఆర్, ఓఆర్ఆర్ మధ్య ఫ్యూచర్ సిటీ అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

# ఈ ఏడాది పెరిగిన సంక్రాంతి ప్రయాణాలు

(మొదటిపేజీ తరువాయి)

పోలిస్తే ట్రాఫిక్ ఇబ్బందులు తప్పాయని వాహనదారులు తెలిపారు.

*** రెట్టింపు సంఖ్యలో వాహనాల ప్రయాణం**

సంక్రాంతి పండగకు ఈ నెల 10వ తేదీ నుంచే వాహనాల రద్దీ పెరిగింది. 10 నుంచి 14 వరకు విజయవాడ, వరంగల్ మార్గాల్లో, 15 నుంచి 19 వరకు హైదరాబాద్ మార్గంలో వాహనాల రద్దీ నెలకొంది. నిరుడు కంటే ఈ సంవత్సరం వాహనాల రద్దీ పది శాతం పెరిగింది. పంతంగి టోల్‌ప్లాజా మీదుగా సాధారణంగా రోజుకు 35 వేల లోపు వాహనాలు ప్రయాణిస్తాయి. సంక్రాంతి రోజుల్లో మాత్రం.. గతేడాది భోగి పండుగ ముందు రోజు 77 వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తే..ఈసారి భోగి పండుగ ముందు రోజు 84,262 వాహనాలు వెళ్లాయి. కొర్లపహాడ్ టోల్‌ప్లాజా మీదుగా రోజుకు 27 వేల లోపు వాహనాలు ప్రయాణిస్తాయి. ఈ సంక్రాంతికి రోజుకు సగటున 5060 వేల వాహనాలు ప్రయాణించాయి. గూడురు టోల్‌ప్లాజా మీదుగా సాధారణంగా రోజుకు 22 వేల వాహనాలు వెళ్తాయి. ఈ సంక్రాంతికి రోజుకు సగటున 4050 వేల వాహనాలు రాకపోకలు సాగించాయి.

# ప్రజల త్యాగాలతోనే రాజ్యాంగ రక్షణ

(మొదటిపేజీ తరువాయి)

భయపడుతోంది. ఆయన్ను కేసులతో వేధిస్తోంది. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. నిబద్ధత, త్యాగమే కాంగ్రెస్ మూల సిద్ధాంతం. దేశవ్యాప్తంగా రైతులు అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న వేళ.. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించలేని కేంద్రం పెట్టుబడిదారులకు మాత్రం పన్నుల నుంచి రక్షణ కల్పిస్తోంది' అని ప్రియాంక వాగ్బాణాలు సంధించారు. సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ మహాత్మాగాంధీ దేశానికి స్వాతంత్ర్యం తెస్తే నెహ్రూ, అంబేడ్కర్ రాజ్యాంగాన్ని దేశ ప్రజలకు అందించారని గుర్తుచేశారు. రాజ్యాంగాన్ని మార్చాలన్న ప్రస్తుత కేంద్రప్రభుత్వ ఆలోచనను తిప్పికొట్టి ఈ దేశాన్ని, రాజ్యాంగాన్ని రక్షించే బాధ్యతను ప్రతి పౌరుడూ తీసుకోవాలని పిలుపునిచ్చారు. సమ్మేళనంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు రణదీప్‌సింగ్ సూర్జేవాలా, కేసీ వేణుగోపాల్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టు అగ్రనేత చలపతి మృతి

(మొదటిపేజీ తరువాయి)

ఇద్దరు మహిళా మావోయిస్టులు కూడా ప్రాణాలు కోల్పోయారు. పలువురు మావోయిస్టులకు గాయాలైనట్లు సమాచారం. మృతుల సంఖ్య పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఘటనలో ఓ జవాన్ గాయపడటంతో హెలికాప్టర్లో రాయ్‌పుర్ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలంలో 3 ఐఈడీ(ఇంప్రవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్)లను గుర్తించారు. ఘటన స్థలంలో నుంచి ఏకే47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ లాంటి ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయని రాయ్‌పుర్ జోన్ ఐజీ అమ్రేశ్ మిశ్రా వెల్లడించారు.



**వెయ్యి మంది జవాన్లతో కూంబింగ్**

రెండు రాష్ట్రాల సరిహద్దుల్లోని బాలుడిగ్గీకుల్హాడీఘాట్ అడవుల్లో పెద్దఎత్తున మావోయిస్టులు ఉన్నారనే నిఘావర్గాల సమాచారంతో ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లకు చెందిన ఈ30, కోబ్రా 207, సీఆర్పీఎఫ్ 65, 211 బెటాలియన్లు, నువాపడ ఎస్‌వోజీ(స్పెషల్ ఆపరేషన్ గ్రూప్) సంయుక్త బలగాలతో కూడిన దాదాపు వెయ్యి మంది జవాన్లు ఈ నెల 19న కూంబింగ్ ప్రారంభించారు. ఆదివారం సాయంత్రం నుంచి నాలుగు డ్రోన్లతో మావోయిస్టుల స్థావరంపై గురిపెట్టినట్లు సమాచారం. ఆ ప్రాంతంలో 60 మంది వరకు మావోయిస్టులున్నారని గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య కాల్పులు ప్రారంభమయ్యాయి. మంగళవారం తెల్లవారుజామున మావోయిస్టు నేతల స్థావరాన్ని భద్రతా బలగాలు చుట్టుముట్టడంతో ఇరువర్గాల మధ్య భీకర కాల్పులు చోటుచేసుకున్నాయి. గరియాబంద్ ఎస్పీ నిఖిల్ అశోక్‌కుమార్ రఖేచా, ఒడిశా రాష్ట్రంలోని నువాపడ ఎస్పీ రాఘవేంద్ర, ఒడిశా డీఐజీ(నక్సల్స్ ఆపరేషన్స్) అఖిలేశ్వర్ సింగ్, కోబ్రా కమాండెంట్ డీఎస్ కథైట్ ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షించారు. వీరిలో ఎస్పీ రాఘవేంద్ర స్వస్థలం ఏపీలోని అన్నమయ్య జిల్లా రాయచోటి. తాజా ఎన్‌కౌంటర్‌కు ప్రణాళిక రూపకల్పన, అమలులో కీలకంగా వ్యవహరించారు.

**బస్తర్‌లో నిర్బంధంతోనే గరియాబంద్ వైపుగా అగ్రనేతలు!**

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలోనే ఎక్కువగా మావోయిస్టుల అగ్రనేతల కదలికలుండేవి. పొలిట్ బ్యూరో, కేంద్ర కమిటీస్థాయి నేతల స్థావరాలు అబూజ్‌మడ్‌లోని దట్టమైన కీకారణ్యంలో ఉన్నాయి. గరియాబంద్ లాంటి అడవుల్లో డీవీసీఎం(డివిజినల్ కమిటీ సభ్యుడు), ఏసీఎం(ఏరియా కమిటీ సభ్యుడు) స్థాయి నేతలు మాత్రమే సంచరిస్తూ.. కార్యకలాపాలు నిర్వహించేవారు. ప్రస్తుతం బస్తర్ అడవుల్లో తీవ్ర నిర్బంధం అమలవుతుండటంతో అగ్రనేతలు ఒడిశా సరిహద్దుల్లో ఉన్న గరియాబంద్ వైపు వచ్చినట్లు తెలుస్తోంది. మావోయిస్టులకు అత్యంత సురక్షిత ప్రాంతమైన అబూజ్‌మడ్ అడవుల్లో భద్రతాబలగాలు ఎక్కడికక్కడ ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్‌లు (ఎఫ్‌వోబీ) ఏర్పాటు చేస్తుండటంతో నిఘా తీవ్రతరం కావడం.. నిరంతరంగా జరుగుతున్న ఎన్‌కౌంటర్లతో సురక్షిత ప్రాంతాలకు అగ్రనేతలు పయనమవుతున్నట్లు కనిపిస్తోంది. ఈ క్రమంలోనే బస్తర్ నుంచి మెయిన్‌పుర్ మీదుగా ఒడిశా వైపు మావోయిస్టుల కదలికలున్నట్లు సమాచారం. దీన్ని పసిగట్టిన భద్రతా బలగాలు వ్యూహాలు మార్చుకుంటూ వెంటాడుతుండటంతో మావోయిస్టులు చెల్లాచెదురవుతున్నట్లు తెలుస్తోంది.

**21 రోజుల్లో 42 మంది మృతి**

ఛత్తీస్‌గఢ్‌లో భద్రత బలగాలు చేపడుతున్న కూంబింగ్ ఆపరేషన్లతో మావోయిస్టులకు తీవ్ర ప్రాణనష్టం వాటిల్లుతోంది. ఈ నెల 16న పుజారికాంకేర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 16 మంది మావోయిస్టులు మృతి చెందగా.. గరియాబంద్ జిల్లాలో సోమవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మృతి చెందారు. తాజాగా గరియాబంద్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో మరో 24 మంది మరణించడం మావోయిస్టు పార్టీకి శరాఘాతంగా మారింది. గతేడాది జరిగిన ఎన్‌కౌంటర్లలో 219 మంది మావోయిస్టులు మరణించగా.. ఈ ఏడాది 21 రోజుల్లోనే సుమారు 42 మంది నేలకొరిగారు.

2016 వరకూ పోలీసులకు చలపతి ఫొటోలేవీ లభించలేదు. భార్య అరుణతో సెల్ఫీ తీసుకోగా.. ఆ చిత్రాన్ని తన సోదరుడైన ఆజాద్‌కు ఆమె పంపించింది. 2016లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆజాద్ మరణించగా.. భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లో చలపతి ఫొటో లభించింది. అతను ఎలా ఉంటాడో అప్పుడే బాహ్యప్రపంచానికి తెలిసింది.

# రాజ్యాంగంతోనే అన్నివర్గాలకు సమ ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాయి)

ఎంపీలు పాల్గొన్నారు. వీరంతా బేంగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో బెళగావి చేరుకున్నారు. ''కాంగ్రెస్ చరిత్రే దేశ చరిత్ర. మహాత్మాగాంధీ జాతీయ కాంగ్రెస్(ఏఐసీసీ) అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాతే దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. అనంతరమే మనకు రాజ్యాంగం వచ్చింది. బాబాసాహెబ్ డా.బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంతోనే మన సమాజంలోని అన్నివర్గాలకు సమ ప్రాధాన్యం లభిస్తోంది'' అని వివరిస్తూ భట్టి ఒక ప్రకటన విడుదల చేశారు.

# ఆసుపత్రి నుంచి ఇంటికి సైఫ్

ముంబయి: తన ఇంట్లో చొరబడిన దొంగతో జరిగిన పెనుగులాటలో కత్తిపోట్లకు గురై ముంబయిలోని లీలావతి ఆసుపత్రిలో చికిత్స పొందిన బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ మంగళవారం డిశ్చార్జి అయ్యారు. బంగ్లాదేశ్‌కు చెందిన షరీఫుల్ ఇస్లాం షెహజాద్ మొహమ్మద్ రోహిల్లా అమీన్ ఫకీర్ (30) ఈ నెల 16న సైఫ్ ఇంట్లోకి చొరబడి ఆయన్ను గాయపరిచిన సంగతి తెలిసిందే. ఆ దాడిలో సైఫ్ చేతికి, మెడకు, వెన్నుకు కత్తిపోటు గాయాలయ్యాయి. ఆయన వెన్నులోకి దిగిన కత్తి ముక్కను డాక్టర్లు శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. సైఫ్‌పై దాడి కేసుకు సంబంధించి పోలీసు విచారణలో నిందితుడు ఫకీర్ పలు విషయాలు వెల్లడించాడు. తనను సైఫ్ ఒడిసి పట్టుకున్నారని, ఆ పట్టు నుంచి విడిపించుకునేందుకే ఆయన వెన్నులో కత్తితో పొడిచానని నిందితుడు తెలిపినట్టు పోలీసు అధికారి ఒకరు మంగళవారం వెల్లడించారు. నిందితుడు ఉపయోగించిన సిమ్ కార్డు పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఖుకుమోని జహంగీర్ సెఖా అనే వ్యక్తి పేరుపై ఉంది. నిందితుడు తన పేరుమీదే ఆధార్ కార్డు పొందేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు.

=++

# 7.25 లక్షల మంది భారతీయుల్లో వణుకు

(మొదటిపేజీ తరువాయి)



చేపట్టాక స్పష్టమైన అధికారిక ఆదేశాలు జారీచేశారు. అధ్యక్షుడిగా బైడెన్ ఉన్నప్పుడు గత ఏడాది వివిధ దేశాలవారి మాదిరిగా 1,529 మంది భారతీయులు కూడా ఈ కారణాలతోనే స్వదేశానికి వెళ్లిపోవాల్సి వచ్చింది. ఇప్పుడు ట్రంప్ రావడంతో పరిస్థితి ఇంకా తీవ్రమవుతుందనే ఆందోళన మొదలైంది. ఒక యాప్ ద్వారా దరఖాస్తు చేసుకుని, సరిహద్దులు దాటి అగ్రరాజ్యంలోకి వచ్చేందుకు ఇదివరకు వీలుండేది. కొత్త సర్కారు దీనికి చెల్లుచీటీ రాసింది.

**జన్మతః లభించే పౌరసత్వంలోనూ కోత**

అమెరికా గడ్డపై పుట్టిన ఇతర దేశాలవారికి జన్మతః లభించే పౌరసత్వాన్ని రద్దుచేయాలని ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వులిచ్చారు. దీనివల్ల భారతీయులకు ఎక్కువ ఇబ్బంది కానుంది. అమెరికా జనాభాలో సుమారు 50 లక్షల (1.47 శాతం) మంది భారతీయులే. వీరిలో మూడోవంతు మంది అమెరికాలో పుట్టినవారు. మిగతావారంతా వలసదారులు. తాత్కాలిక వీసాపై అమెరికా వెళ్లి, గ్రీన్‌కార్డుకోసం వేచిచూస్తున్నవారికి పుట్టిన సంతానానికి అమెరికా పౌరసత్వం లభించదు. పిల్లలకు అమెరికా పౌరసత్వం లభించాలన్న ఉద్దేశంతో చాలామంది భారతీయులు కాన్పు సమయానికి అమెరికా వెళ్లిపోతుంటారు. ఇకపై దీనికి బ్రేక్ పడనుంది. బిడ్డ తల్లి అమెరికాలో అక్రమంగా ఉంటున్నా, తండ్రి అమెరికా పౌరుడుగానీ, చట్టబద్ధ శాశ్వతనివాసి గానీ కాకపోయినా ఆటోమేటిక్ పౌరసత్వం రాదు. కాన్పు సమయంలో బిడ్డ తల్లి అమెరికాలోనే చట్టబద్ధంగా ఉన్నా, అది తాత్కాలిక ప్రాతిపదికన అయినప్పుడు (ఉదాహరణకు విద్యార్థి వీసా, పర్యాటక వీసాపై రావడం వంటివి) కూడా ఇది రాదు.

**అమెరికా ప్రజలకూ ఇబ్బందే**

నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాపై అమెరికా వెళ్లిన భారతీయ విద్యార్థులకు జన్మించిన పిల్లలకు అమెరికా పౌరసత్వం లభించడం దాదాపు అసాధ్యం. అమెరికాలో ఉంటున్న విదేశీ విద్యార్థుల్లో ఎక్కువమంది భారతీయులే. వీరిలో కొందరు ఇతర దేశాలకు చెందినవారిని అక్కడే వివాహం చేసుకుంటారు. ఇలాంటివారు ఇకపై పిల్లల పౌరసత్వం విషయంలో చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

# మా రాష్ట్రం.. పెట్టుబడుల నేస్తం

- **గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ గ్లోబల్‌హబ్‌గా ఏపీని తీర్చిదిద్దుతాం**
- **పునరుత్పాదక రంగంలో పెట్టుబడులకు రాష్ట్రం అనుకూలం**
- **స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో అనుమతులు**
- **దావోస్‌లో సీఐఐ సమావేశంలో సీఎం చంద్రబాబు**

గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. ఈ రంగంలో సుస్థిరాభివృద్ధి సాధించి, ఇంధన సంస్కరణలతో ఏపీని ఆదర్శంగా నిలపాలన్నదే తమ లక్ష్యమన్నారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచదేశాల ఆర్థిక సదస్సు(వరల్డ్ ఎకనమిక్ ఫోరం)లో రెండోరోజు గ్రీన్ ఇండస్ట్రియలైజేషన్ అంశంపై కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్(సీఐఐ) నిర్వహించిన సమావేశంలో సీఎం పాల్గొని మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు అత్యంత అనుకూల రాష్ట్రమన్నారు. '1999లో మొదటిసారి విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చాం. వాటి ఫలాల్ని ఇప్పుడు అనుభవిస్తున్నాం. సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిలో రాష్ట్రం గణనీయమైన పురోగతి సాధించింది. దేశ పునరుత్పాదక ఇంధన లక్ష్యాలను వేగవంతం చేయడానికి 21 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో ఎన్‌టీపీసీ, ఏపీ జెన్‌కో భాగస్వామ్యంతో పూడిమడక దగ్గర ఏర్పాటు చేయనున్న గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. దీంతోపాటు రాష్ట్రంలో బయోఫ్యూయల్ ప్లాంట్ల ఏర్పాటు ద్వారా రిలయన్స్ సంస్థ రూ.65వేల కోట్ల పెట్టుబడులు పెడుతోంది' అని సీఎం చెప్పారు. 1995 నుంచి సీఐఐతో దీర్ఘకాలిక భాగస్వామ్యం ఉందన్నారు. ఐటీ, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో ఆవిష్కరణలకు హైదరాబాద్ గ్లోబల్ హబ్‌గా ఆవిర్భవించడాన్ని తన దూరదృష్టికి నిదర్శనంగా ఉదహరించారు.

*** జనాభా... మాకున్న అనుకూలత**

భారతదేశ గొప్ప ఆస్తి జనాభానే అని చంద్రబాబు అన్నారు. 'భారతీయ పారిశ్రామికవేత్తలు.. ప్రత్యేకంగా ఏపీ వారు ప్రపంచవ్యాప్తంగా రాణిస్తున్నారు. 2027 నాటికి దేశ జీడీపీ వృద్ధిరేటు భారీగా పెరుగుతుందని బ్లూమ్‌బర్గ్ అంచనా వేసింది. 2028 నుంచి భారత శకం ప్రారంభమవుతుంది. దేశానికి ప్రధాని మోదీ స్థిరమైన నాయకత్వాన్ని అందిస్తున్నారు. స్థిరమైన ప్రభుత్వంతో దార్శనిక నాయకుడిగా గుర్తింపు పొందారు. వికసిత్ భారత్ 2047 ద్వారా దేశాన్ని సూపర్‌పవర్‌గా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నారు. సంపద సృష్టిలో భారతీయులు అగ్రగాములుగా నిలుస్తారు' అని సీఎం విశ్వాసం



వ్యక్తంచేశారు.

**అమరావతిలో గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్**

సంక్లిష్ట సమస్యలను పరిష్కరించడానికి, రోజువారీ జీవితాన్ని మెరుగుపరచుకోవడానికి కృత్రిమ మేధ(ఏఐ), రియల్ టైం డేటా వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సీఎం స్పష్టంచేశారు. 'భవిష్యత్ తరాలకు నాయకులను తీర్చిదిద్దేందుకు అమరావతిలో సీఐఐ భాగస్వామ్యంతో గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ (జీఎల్‌సీ) ఏర్పాటు చేస్తున్నాం. దీనికోసం స్విట్జర్లాండ్‌లోని ఐఎండీ బిజినెస్ స్కూల్, జీఎల్‌సీలతో లెటర్ ఆఫ్ ఇండెంట్ (ఎల్‌వోఐ) కుదుర్చుకున్నాం. దీనివల్ల గ్లోబల్ స్థాయిలో పోటీతత్వం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం సాధ్యం అవుతుంది' అని చెప్పారు.

# మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోసాలపై అలర్ట్ గా ఉండాలి

*** జిల్లా ఎస్పీ రోహిత్**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోసాలపై అలర్ట్ గా ఉండాలని జిల్లా ఎస్పీ రోహిత్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ ఉత్పత్తులు,హెర్బల్,హెల్త్ కేర్, ఇతర గృహోపకరణాల మార్కెటింగ్ పేరుతో కొత్త తరహా మోసాలు జరుగుతున్నాయని జిల్లా ఎస్పీ మంగళవారం ఒక ప్రకటనను విడుదల చేశారు.తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు ఇస్తామని, మళ్లీ మల్టీ లెవెల్ మార్కెటింగ్ (పిరమిడ్ మోసాలు) మళ్ళీ ప్రారంభమయ్యాయని అన్నారు. గొలుసుకట్టుగా అమాయకులను వల వేసి మోసం చేస్తున్నారని హెచ్చరిస్తున్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఈ విధమైన మోసాలకు కొంతమంది వ్యక్తులు పాల్పడుతున్నారని,అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ తరహా మోసాల బారిన పడకుండా ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తతతో వ్యవహరించాలని కోరారు. మనల్ని నమ్మించి,మభ్యపెట్టి, వంచించి మన దగ్గరి,మన ద్వారా మరికొందరి కష్టార్జితాన్ని కొల్లగొట్టడమే మోసగాళ్ల పని అని తెలిపారు.కాబట్టి ఇలాంటి నేరాల పట్ల మొబైల్ ఫోన్లను చూసే మనకు ఫేస్బుక్,వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్స్టాగ్రామ్, యూట్యూబ్, ఈమెయిల్, ఫోన్ కాల్ ల ద్వారా మీ దృష్టిని ఆకర్షించే ఇటువంటి కుట్రలకు ఎట్టిపరిస్థితుల్లో లొంగవద్దని తెలిపారు.తొందరపడి బాధలను,నష్టాలను కొని తెచ్చుకోవద్దన్నారు.ఒకవేళ మీరు అన్ని జాగ్రత్తలను తీసుకున్నా కూడా మోసపోయిన పక్షంలో ఒక్క క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా 1930 టోల్ ఫ్రీ నంబర్ కి గానీ, www.cybercrime.gov.in ద్వారా కానీ లేదా మీ సమీప పోలీస్ స్టేషన్ లో నైనా వెంటనే పూర్తి వివరాలతో ఫిర్యాదు చెయ్యాలని సూచించారు. సైబర్ మోసాల బారిన పడిన బాధితులు ఎంత త్వరగా ఫిర్యాదు చేయగలిగితే అంత త్వరగా వారు కోల్పోయిన నగదును తిరిగి పొందవచ్చని తెలిపారు.

# వార్డు సభలు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

*** సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కొరకు జరిపే వార్డు సభలు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు అన్నారు. వార్డులలో జరుగుతున్న వార్డు సభల వద్ద ఆయన ప్రజలతో మాట్లాడుతూ గతంలో ఆర్థిక సామాజిక సర్వే ఆధారంగా ఇల్లు ఇళ్ల స్థలాలు లేని పేదలు , రేషన్ కార్డు లేని వారిని గుర్తించారు అలాంటి వారిని అర్హులుగా ప్రకటించి వాటిపై భిన్నాభిప్రాయాలు ఉంటే వార్డు సభల ద్వారా తెలుసుకోవాలని సూచించారు కానీ లిస్టులో పేరు లేకుండా మళ్లీ ప్రజలతో దరఖాస్తులు తీసుకునే ప్రక్రియ ప్రారంభించారని ఆ దరఖాస్తు తీసుకున్నట్టుగా ప్రజలకు ఏమి రసీదు కూడా ఇవ్వడం లేదని వాటికి జవాబుదారీతనం ఎలా ఉంటుందని ఆయన ప్రశ్నించారు. ప్రజల వద్ద నుండి తీసుకునే ప్రతి దరఖాస్తుకు రసీదు ఇవ్వాలని ఈ దరఖాస్తులు పెట్టుకున్న వారికి ఎప్పుడు లబ్ధిదారుల గుర్తిస్తారో కూడా తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టా ఉన్న వారికే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం నిర్ణయం సరైంది కాదని కొత్తగూడెం మున్సిపాలిటీలో రామవరం , ఇతర ప్రాంతాలలో చాలామందికి పట్టాలు లేవని గత ప్రభుత్వాలు పట్టాలు ఇస్తామని చెప్పి ప్రకటనలకే పరిమితం అయ్యారు తప్ప పట్టాలు ఇవ్వకపోవడం వలన ఇప్పుడు వారందరూ సొంతింటి పథకానికి దూరమయ్యే ప్రమాదం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఎలాంటి షరతులు లేకుండా ఖాళీ స్థలం ఉన్న ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లబ్ధిదారులు ఎంపిక రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా జరపాలని ఆయన డిమాండ్ చేశారు. వార్డు సభలు వద్ద సిపిఎం నిర్వహించిన ఆందోళనకు అధికారులు స్పందించి ప్రజల వద్ద నుండి తీసుకునే దరఖాస్తులకు రసీదులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ టౌన్ కమిటీ సభ్యులు డి వీరన్న శ్రీను ప్రమోద్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో మేలు

**కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : నిరుపేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో మేలు చేస్తుందని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ నివాసం వద్ద ఇటీవల అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలో చేరిన మహంకాళి కృష్ణ కు రూ.57,500లు, తడకల మంజుల కు రూ.60,000లు, కల్లెం రవీందర్ గౌడ్ కు రూ.30,000లు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన అందజేశారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చాలా మేలు జరుగుతుందన్నారు. అపదలో ఉన్న వారికి అప్పన్న హస్తంలా ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ యాదవ్, నగేష్, మధుసూదన్ , వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కోట్లాది రూపాయల నిధులతో

# నిజాంపేట ను మోడ్రన్ కార్పొరేషన్ గా అభివృద్ధి పరచాం

*** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : గత పదేళ్ల కాలంలో నిజాం పేట్ కార్పొరేషన్ ను కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పరిచి మోడ్రన్ కార్పొరేషన్ గా అభివృద్ధి పరచామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. మంగళవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలోని డివిజన్ 1,15,17,19,20 లల్లోని పలు కాలనీలలో రూ.4.19 కోట్లతో నూతనంగా చేపట్టనున్న సిసి రోడ్డు, భూగర్భ డ్రైనేజీ, వాటర్ పైప్ లైన్ పనులకు ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో కూడా నిజాం పేట్ కార్పొరేషన్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి జిల్లాలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా 15వ డివిజన్ పరిధిలోని పత్తికొండ చెరువు నుంచి బెరెకా చర్చ్ వరకు రూ.8 లక్షల వ్యయంతో నిర్మించనున్న భూగర్భ డ్రైనేజ్ , సిసి రోడ్డు పనులకు, సాయిబాబా దేవాలయం వద్ద రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులు, రాజీవ్ గాంధీ నగర్ నందు రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు, 17వ డివిజన్ నందు గల కౌసల్య కాలనీలో రూ.60 లక్షల వ్యయంతో గ్రంథాలయం , డ్వాక్రా బిల్డింగ్ నిర్మాణం, సాయి క్రిషాజ హిల్స్ నందు రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. 1వ డివిజన్ లో రూ. 85.00 లక్షల తో చేపట్టనున్న సిసి రోడ్డు , స్టాం వాటర్ లైన్ పనులు, 19 డివిజన్ పరిధిలోని లక్ష్మీ కాలనీలో రూ.10 లక్షల తో నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు, 20వ డివిజన్ పరిధిలో రూ.8.00 లక్షల తో చేపట్టనున్న స్టాం వాటర్ లైన్ పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కార్పొరేటర్లు ఆగం రాజు, కాసాని సుధాకర్ ముదిరాజ్, గాజుల సుజాత, రాఘవేందర్ రావు, బాలాజీ నాయక్, జ్యోతి నరసింహారెడ్డి, కోఆప్షన్ సభ్యులు చంద్రగిరి జ్యోతి సతీష్, సలీమ్, మహిళా అధ్యక్షురాలు అర్పిత ప్రకాష్, నాయకులు సాంబశివారెడ్డి, స్వామి, అజయ్ చౌదరి, ప్రదీప్, జశ్వంత్, వైయస్, మేకల మధుసూదన్, రవీందర్ రెడ్డి, శివ, ఖాన్, దూసకంటి వెంకటేష్, సలీం, మహిళా నాయకురాలు క్రిష్ణ మంజరి, స్వర్ణ కుమారి, యూత్ నాయకులు బద్రి, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.



## నేటి చలో జిహెచ్ఎంసి

# ప్రధాన కార్యాలయంను జయప్రదం చేయాలి

*** సిఐటియు కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు కీలుకాని లక్ష్మణ్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : జిహెచ్ఎంసి మునిసిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించే చలో జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంను జయప్రదం చేయాలని సిఐటియు కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు కీలుకాని లక్ష్మణ్ పిలుపునిచ్చారు. మంగళవారం జిహెచ్ఎంసి కార్మికులతో కలిసి సూరారం డివిజన్ సంజయ్ గాంధీ నగర్ వార్డ్ ఆఫీస్ దగ్గర కరపత్రం విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 100 కార్పొరేషన్ డివిజన్లో 20వేల మంది మున్సిపల్ సిబ్బంది కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎన్ ఎమ్ ఆర్ ఫిక్స్డ్ పై తదితర పద్ధతుల్లో ఉద్యోగులు కార్మికులు పని చేస్తున్నారన్నారు. సంవత్సరాల తరబడి విధులు నిర్వహిస్తున్న పర్మినెంట్ కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. అర్హత కలిగిన వారికి ప్రమోషన్లు ఇవ్వడం లేదన్నారు. అనేక మున్సిపల్ కార్పొరేషన్లలో కార్మికులకు ఎలాంటి రక్షణ సదుపాయాలు కల్పించకపోవడంతో పనిచేసే క్రమంలో ప్రమాదాలు జరిగి అనేకమంది మృతి చెందుతున్నారని, అటువంటి వారికి ప్రభుత్వం ఎలాంటి నష్టపరిహారం చెల్లించడం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించి , పారిశుద్ధ్య కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. శాశ్వతమైన పనులకు శాశ్వతమైన కార్మికులను నియమించాలన్నారు. భారత రాజ్యాంగం దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు , రాష్ట్ర హైకోర్టు చెబుతున్నప్పటికీ ఏ ఒక్కటి అమలుకు నోచుకోవడం లేదన్నారు. జిహెచ్ఎంసి మున్సిపల్ కార్మికుల పర్మనెంట్, కనీస వేతనం 26 వేల రూపాయలు అమలుకై, జిహెచ్ఎంసిలో పనిచేస్తున్న ఇల్లు లేని పారిశుద్ధ్య కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలన్నారు. ప్రమాదాల్లో మరణిస్తున్న కార్మికులకు 25 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలని, దహన సంస్కారాలకు 30 వేల రూపాయలు ఇవ్వాలన్నారు. జిహెచ్ఎంసి సూపర్వైజర్లకు ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలను 35 వేలకు పెంచి, పెట్రోల్ అలవెన్సు ఇవ్వాలి జిహెచ్ఎంసి పరిధిలో గత మూడు సంవత్సరాల నుండి వయసు పైబడిన వారు ప్రమాదం జరిగి మరణించిన వారు లాంగ్ ఆఫ్సెంట్స్ పెట్టుకున్న వారు సుమారు 3000 మంది కుటుంబ సభ్యులకు పని కల్పించాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్ జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం వద్ద జరుగుతున్న మహాధర్నాను మునిసిపల్ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఈ దేవదానం, సిఐటియు మండల నాయకులు పసుల అంజయ్య, మున్సిపల్ కార్మికులు కౌసల్య, రాములమ్మ, పెంటమ్మ, ధనమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయం

*** సిరిసిల్ల రూరల్ సిఐ మొగిలి**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయమని, ప్రజలు పోలీసులకు సహకరించాలని సిరిసిల్ల రూరల్ సిఐ మొగిలి అన్నారు. ముస్తాబాద్ మండలంలోని తుర్కపల్లి గ్రామంలో ముస్తాబాద్ ఎస్సై సిహెచ్.గణేష్ ఆధ్వర్యంలో మంగళవారం మీ కోసం పోలీస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల రూరల్ సిఐ మొగిలి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో సాధారణ పౌరులతో పోలీసులు ఫ్రెండ్లీ పోలీసింగ్ కొనసాగిస్తూనే, నేరస్తుల పట్ల కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని తెలిపారు. గ్రామాల్లో అక్రమ దందాలు, అక్రమ రవాణాలు, అసాంఘిక కార్యకలాపాలపై ఎలాంటి సమాచారం ఉన్న స్థానిక పోలీసులకు అందించాలని సూచించారు. గ్రామాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరాలు నేరాల నియంత్రణకు దోహదపడతాయని అన్నారు. సీ సీ కెమెరాలు ఏర్పాటుకు వ్యాపారులు సహకారం అందించాలని కోరారు. రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరు తప్పకుండా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కార్లలో వెళ్లేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, వాహనానికి సంబంధించిన ప్రతి ఒక్క ధృవీకరణ పత్రం వెంట ఉంచుకోవాలని, లైసెన్సులు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, సెల్ఫోన్ డ్రైవింగ్ చేయవద్దని, పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావద్దని సూచించారు. నిషేధిత గంజాయి, మాదకద్రవ్యాలు, గుడుంబా పై ఎలాంటి సమాచారం ఉన్న స్థానిక పోలీసులకు అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు సైబర్ నేరాల పట్ల ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని, తద్వార వాటి బారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు. ఓటిపిలు చెప్పడం, అనుమానాస్పద లింకులను ఓపెన్ చేయడం ద్వారా సైబర్ నేరాలకు గురవుతారని, రోజుకో కొత్త తరహాలో సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను టార్గెట్ చేస్తున్నారని, ప్రజలు ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలను ఎవరైనా వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే పోలీసులకు సమాచారం అందించాలని, ఆకతాయిలు మహిళలను వేధిస్తే వారి భరతం పడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బడీడు పిల్లలను పాఠశాలకు పంపించాలి

*** మండల విద్యాధికారి నిమ్మ రాజిరెడ్డి**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: బడీడు పిల్లలను పాఠశాలకు పంపించాలని మండల విద్యాధికారి నిమ్మ రాజిరెడ్డి సూచించారు. బడి బయట పిల్లల సర్వేలో భాగంగా ముస్తాబాద్ మండల కేంద్రంలోని పెద్దమ్మల కాలనీలో ఇంటింటా సర్వే నిర్వహించారు. బడికి రాకుండా ఇంటి వద్దనే ఉంటున్న పిల్లల తల్లిదండ్రులకు పిల్లలను పాఠశాలలకు పంపించాలని సూచించారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, చదువుకోకపోతే భవిష్యత్‌లో ఎదురయ్యే కష్టాలను తల్లిదండ్రులు వారి పిల్లలకు సూచించి బడికి పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఎస్ హెచ్ఎం ప్రభాకర్ రెడ్డి, సిఆర్‌పి పరశు రాములు, సిసిఓ రాజేందర్ తదితరులున్నారు.

# బదిర విద్యార్థిని ఉన్నత చదువుకు అండగా నిలిచిన ప్రభుత్వం

- **కలెక్టర్ ప్రత్యేక చొరవతో ఆర్థిక సహాయం**
- **కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థిని కుటుంబ సభ్యులు**



ప్రజాస్ఫూర్తి, సిరిసిల్ల : బదిర విద్యార్థిని ఉన్నత విద్యాభ్యాసానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన దోమలకొండ పోచయ్య కుమార్తె దోమకొండ లహరి కరీంనగర్ జిల్లాలోని బధిరుల పాఠశాలలో 10వ తరగతి వరకు చదివింది. ఉన్నత విద్యాభ్యాసం చేసేందుకు ఆర్థిక స్థోమత లేక ఇంటి వద్దే ఉంటుంది. ఈ విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థి వివరాలు సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.1.40లక్షల ఆర్థిక సహాయాన్ని సిఎంఆర్ఎఫ్ కింద పంపింది. మంగళవారం దోమకొండ లహరికి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చెక్కు అందజేశారు. ఉన్నత విద్య అభ్యసించి అనుకున్న లక్ష్యం చేరుకోవాలని ఆకాంక్షించారు. తమ కూతురు చదువుకు ఆర్థిక సహాయం అందించిన రాష్ట్ర ప్రభుత్వం, సహకరించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు దోమకొండ లహరి, ఆమె తల్లితండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# దొంగకు మూడు సంవత్సరాల జైలు, రూ.200 జరిమానా

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: దొంగతనం కేసులో దొంగకు మూడు సంవత్సరాలు జైలు శిక్షతోపాటు, 200 రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల మొదటి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పు వెల్లడించినట్లు ముస్తాబాద్ ఎస్ఐ గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మే 04, 2024న ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి గ్రామంలోని పెద్దమ్మ గుడిలో పెద్దమ్మ తల్లి పుస్తె మట్టెలు చోరీకి గురయ్యాయి. మే, 5 , 2024 న గ్రామ ముదిరాజ్ కుల సంఘం అధ్యక్షుడు గాడిచర్ల రామచంద్రం ముస్తాబాద్ పోలీస్టేషన్లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్ఐ శేఖర్ రెడ్డి దర్యాప్తు చేసి దొంగతనం చేసిన వేములవాడ మండలం ఫాజిల్ నగర్ గ్రామానికి చెందిన శివరాత్రి సంపత్‌ని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెలిమల సందీప్ వాధించగా, కోర్టు సి ఎం ఎస్ ఎస్ఐ రవీందర్ నాయుడు, కోర్టు కానిస్టేబుల్ ఆడేపు దేవేందర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ నిందితుడికి మూడు సంవత్సరాలు జైలు శిక్షతోపాటు 200 రూపాయల జరిమానా విధించినట్లు ఎస్ఐ వివరించారు.

## నిర్మాణంలో ఉన్న భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలి


- **జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.రజిత**



ప్రజాస్ఫూర్తి, సిరిసిల్ల: గంభీరావుపేట మండలం లింగన్నపేట, ముస్తాబాద్ మండలం పోతుగల్లు, ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్, వీర్నపల్లి మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణంలో ఉన్న భవనాలను తొందరగా పూర్తి చేయాలని భవన నిర్మాణ కాంట్రాక్టర్లకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్. రజిత సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్. రజిత మంగళవారం ఆయా భవన నిర్మాణాలను పరిశీలించారు. వీర్నపల్లి మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను నూతనంగా అద్దె భవనంలో ఆరోగ్య సేవలు ప్రజలకు అందుబాటులో ఉంచడం కొరకై అద్దె భవనంను పరిశీలించారు. ఎల్లారెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించి ప్రాథమిక కేంద్ర వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కేంద్ర ఆరోగ్య కార్యక్రమాలలో మాతా శిశు సంరక్షణ కార్యక్రమం, ఎన్సీడీలో క్యాన్సర్, రక్తపోటు, మధుమేహ నమోదు కార్యక్రమం, ఆయుష్మాన్ భారత్ కార్డు నమోదు కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట వైద్యాధికారులు డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డిపిఓ రాజేందర్, డిడిఎం కార్తీక్ పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- **జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్.**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: గణతంత్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ జిల్లా అధికారులను ఆదేశించారు.మంగళవారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన రిపబ్లిక్ డే వేడుకలకు సంబంధించి సమావేశం లో మాట్లాడుతూ ప్రగతి మైదానంలో అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. స్టేజి ఏర్పాట్లు తో పాటు విద్యా శాఖ ద్వారా కల్చరల్ ప్రోగ్రామ్స్ నిరంతర విద్యుత్ తో పాటు త్రాగునీరు, సౌండ్ ప్రూఫ్ జనరేటర్ ను అందుబాటులో ఉంచాలని అదేవిదంగా బారికేటింగ్ పటిష్టంగా చేపట్టాలని అలాగే ఎంట్రీ, ఎగ్జిట్ గేట్స్ వద్ద వచ్చే అతిధులు, ప్రజలు ఇబ్బందులు పడకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని పిల్లల సంస్కృతిక ప్రదర్శనలు, పోలీస్ గౌరవందనం సమయపాలన ఉండాలని సూచించారు. అదేవిదంగా అంబులెన్సు, అగ్నిమాపాక సిబ్బంది అందుబాటులో ఉండాలని, గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన , వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 24 వరకు గ్రామసభలు

- **తెలంగాణవ్యాప్తంగా కొనసాగుతున్న గ్రామసభలు**
- **రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు**
- **గ్రామ సభల్లోనే లబ్ధిదారులను ఎంపిక చేయనున్న ప్రభుత్వం**



ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయడానికి తెలంగాణవ్యాప్తంగా గ్రామ, వార్డు సభలు జరుగుతున్నాయి. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు... ఈ నాలుగు పథకాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. దరఖాస్తులను స్వీకరించి గ్రామసభల్లోనే లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. దరఖాస్తుల స్వీకరణ కోసం ఈ నెల 24వ తేదీ వరకు గ్రామ సభలు, వార్డు సభలు కొనసాగనున్నాయి. గ్రామసభల్లో ప్రభుత్వ సంకల్పం, పథకాల వివరాలను ప్రజలకు తెలిపి అభిప్రాయాలను సేకరిస్తున్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం వార్డు సభలు ప్రారంభం కావాల్సి ఉంది. జీహెచ్ఎంసీ పరిధిలో లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారుల సర్వే ఇంకా పూర్తి కాలేదు. ఈ సర్వే పూర్తయ్యాక ఫిబ్రవరి 1 నుంచి వార్డు సభలను నిర్వహించనున్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి

# ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుంది

- **పీఏసీ చైర్మన్ , శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ**

శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందని పీఏసీ చైర్మన్ , శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా 33 మంది లబ్ధిదారులకుముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.17,93,000లక్షల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను మంగళవారం స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి ఎమ్మెల్యే గాంధీ బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని అన్నారు. ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని అన్నారు. అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందన్నారు. పేద మధ్యతరగతి ప్రజలకు ఆసుపత్రిలో బిల్లులు కట్టలేని పరిస్థితిలో ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆర్థిక సాయంని అందిస్తుందన్నారు. గతంలో ఉన్న బిల్లులకు అనుగుణంగానే ప్రస్తుతం ఆర్థిక సాయం అందిస్తుందని దానిని మరింత పెంచేలా కృషి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి త్వరలోనే కలిసి వినతి పత్రాన్ని అందజేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా వైద్య చికిత్స కి సహకారం అందించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ కి బాధితుల కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాంబశివరావు, చంద్రిక ప్రసాద్ గౌడ్,కావూరి అనిల్,ఎల్లం నాయుడు,చిరుమూర్తి రాజు, సల్లావుద్దీన్ ,రాము, సాయి తదితరులు పాల్గొన్నారు.



## మైనింగ్ సూపర్వైజర్ల బదిలీలను నిలిపివేయాలి

- **జెఎంఈటిల ప్రమోషన్లలో జరిగే అన్యాయాన్ని సరిచేయాలి**
- **గరేణి గుర్తింపు సంఘం నేతలు సీతారామయ్య, రాజ్ కుమార్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం ఏరియాలో పని చేస్తున్న మైనింగ్ సూపర్వైజర్ సిబ్బందిని బదిలీలను నిలుపుదల చేసి త్వరలో ప్రారంభం కానున్న వికె7 ఓపెన్ క్యాస్టులో సర్దుబాటు చేయాలని గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కేంద్ర కమిటీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కోరిమి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. సింగరేణి జనరల్ మేనేజర్ (ఐఆర్)ను యూనియన్ ప్రతినిధు బృందం వినతిపత్రం అందించి సమస్యలను అధికారికి వివరించారు. చర్చల అనంతరం నాయకులు మాట్లాడుతూ 2016లో అప్పటి గుర్తింపు సంఘం చేసిన తప్పుడు ఒప్పందంతో జెఎంఈటిల ప్రమోషన్లలో అన్యాయం జరుగుతోందని, వీరు చేసిన ప్రమోషన్స్ ఒప్పందం కొందరికె ఉపయోగపడిందని, ప్రతి ఒక్కరికి బి గ్రేడ్ అవర్మేన్లుగా ప్రమోషన్స్ ఇవ్వాలని కోరామన్నారు. గతంలో బదిలీపై వచ్చిన వారిని మరల కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీ చేయడం వలన వారి కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నారని ఈ సమస్యకు పరిస్కారం చూపాలన్నారు. వెబ్ కౌన్సిలింగ్ ద్వారా ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన మైనింగ్ సిబ్బందికి సెటిలింగ్ అలవెన్సు మంజూరు చేయాలనీ కోరామని తెలిపారు. వినతిపత్రం అందించినవారిలో వంగ వెంకట్, వట్టికొండ మల్లికార్జునరావు, రమణమూర్తి, రాంగోపాల్, కిష్టాఫర్, సాయి పవన్, దార శివ తదితరులు ఉన్నారు.

## కరడుగట్టిన నేరస్థుడు బుర్హానుద్దీన్ అరెస్ట్

హైదరాబాద్: ఓ హత్యాయత్నం కేసులో తప్పించుకు తిరుగుతున్న బుర్హా నుద్దీన్‌ను మెయినాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిపై పలు పోలీస్ స్టేషన్లలో 15 కేసులున్నాయి. భూ కబ్జాతో పాటు బెదిరింపులు, మోసాలు, దాడులు వంటి కేసులు ఉన్నాయి. 2011లో మైనింగ్ కాంట్రాక్ట్ ఇవ్వాలంటూ ఝార్ఖండ్ సీఎంకు సైతం నిందితుడు ఫోన్ చేసినట్టు పోలీసులు తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పీఏ నంటూ కూడా పలువురిని మభ్యపెట్టినట్టు గుర్తించారు. ఆ కేసులో అరెస్టయి జైలు పాలయ్యాడు. ఏపీ మాజీ మంత్రి కుమారుడిని హనీ ట్రాప్ చేసి రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేసినట్టు పోలీసులు వివరించారు. ఈడీ కేసులో ఓ ఐఏఎస్ అధికారిని సైతం బ్లాక్ మెయిల్ చేసినట్టు ఆరో పణలు వచ్చాయి. దీంతో పాటు నిం దితుడి పై ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కూడా కేసులు ఉన్నాయి. ఇతనిపై పోలీసులు రౌడీషీట్ తెరిచారు. తాజాగా బుర్హానుద్దీన్ మరో 9 మందితో కలిసి



హాకీ స్టిక్స్, ఇనుపరాడ్లు, క్రికెట్ బ్యాట్లతో భయభ్రాంతులకు గురి చేసి ఖాళీ స్థలం కబ్జాకు యత్నించినట్టు మహ్మద్ హఫ్రోజ్ బేగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ ముఠాను అరెస్టు చేశారు.

## పరికి చెరువు హద్దులు నిర్ణయించేంత వరకు నిర్మాణాలు అపాలి

- **సిపిఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : పరికి చెరువు హద్దులు నిర్ణయించేంత వరకు నిర్మాణాలను అపాలని సిపిఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో హైడ్రా కమీషనర్ రంగనాథ్ ని సిపిఐ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా పరికి చెరువు విస్తీర్ణం,ఎఫ్ టి ఎల్ హద్దులు,ప్రభుత్వ సర్వే నంబర్లను,గతంలో ఉన్న ఫోటోలను ఇతర ఆధారాలను చూపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ,ప్రభుత్వ రికార్డుల ప్రకారం పరికి చెరువు విస్తీర్ణం 60.84 ఎకరాలుగా ఉందని కాని నేడు అది మొత్తం మాయం అయ్యిందని , వెంటనే నిర్మాణాలను ఆపివెయ్యాలని కోరారు. పరికి చెరువును,గుట్ట పై ఉన్న భూములను హైడ్రా కమీషనర్ పర్యటించినప్పటికి నూతనం గా బేస్మెంట్ నిర్మాణం జరిగిందని చెప్పగా,ఈ అరు నెలలుగా ఏ కొత్త నిర్మాణం అక్రమమని తెలితే ఖచ్చితంగా కూల్చివేస్తామన్నారు. బుధవారం అందరితో సమావేశం నిర్వహిస్తామని , ఆ రోజు ఎలాంటి చర్యలు చేపట్టాలో నిర్ణయిద్దామని తెలియజేసినట్లు తెలిపారు.. అధికారులకు సమస్యపైన సమాచారం సేకరించి చర్యల కోసం ఆదేశించడం ఒక శుభాపరిణామమన్నారు. చర్యలు కూడా తీసుకుంటే చెరువులను,భూములను కాపాడుకోవచ్చని సిపిఐ నాయకులు భావించారు.ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు రాములు, కే.వెంకటేష్, నాయకులు సామెల్, నరేందర్ లు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు గుండెపోటు


- **కుటుంబంతో డెహ్రాడూన్ పర్యటనలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే**
- **అస్వస్థతకు గురవడంతో ఆసుపత్రికి తరలించిన కుటుంబ సభ్యులు**
- **స్టంట్ వేసి... ప్రాణాపాయం లేదని చెప్పిన వైద్యులు**



సికింద్రాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత పద్మారావు గౌడ్‌కు గుండెపోటు వచ్చింది. ప్రస్తుతం తన కుటుంబం సహా ఆయన డెహ్రాడూన్ పర్యటనలో ఉన్నారు. ఈ సమయంలో ఆయన అస్వస్థతకు గురయ్యారు. ఆయనకు గుండెపోటు వచ్చిందని గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. పద్మారావు గౌడ్‌ను పరీక్షించిన వైద్యులు స్టంట్ వేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఎలాంటి ప్రాణాపాయం లేదని తెలిపారు.

# నిర్మాత దిల్ రాజు ఇళ్లు, కార్యాలయాల్లో కొనసాగుతున్న ఐటీ సోదాలు

హైదరాబాద్: ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. దీనితో పాటు ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్ కార్యాలయాలు, 'పుష్ప 2' చిత్రం నిర్మాత నవీన్ ఎర్నేని నివాసంలో సోదాలు జరుగుతున్నాయి. ఏకకాలంలో 8 చోట్ల 55 బృందాలతో తనిఖీలు చేస్తున్నారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో దిల్ రాజు ఇళ్లతో పాటు ఆయన సోదరుడు శిరీశ్, కుమార్తె హన్సితరెడ్డి నివాసాల్లోనూ ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారు. దిల్ రాజు సతీమణి వైగారెడ్డిని కారులో



తీసుకెళ్లారు. బ్యాంక్ లాకర్లను పరిశీలించి అనంతరం ఇంటికి తీసుకువచ్చారు. వ్యాపార భాగస్వాముల నివాసాల్లోనూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివిధ పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు. బ్యాంక్ లాకర్లు ఓపెన్ చేయడానికి ఆదాయపుపన్ను అధికారులు తనను తీసుకెళ్లినట్లు దిల్ రాజ్ భార్య తెలిపారు. ''ఉదయం నుంచి ఐటీ శాఖ అధికారులు సోదాలు చేస్తున్నారు. సినిమాలకు సంబంధించి తనిఖీలు చేస్తున్నారు. ఇవి సాధారణంగా జరిగే సోదాలు మాత్రమే. ఐటీ శాఖ అధికారులు బ్యాంకు వివరాలు కావాలని అడిగారు. బ్యాంకు లాకర్స్ ఓపెన్ చేసి చూపించాం'' అని ఆమె తెలిపారు.



# మహా కుంభమేళాకు పోటెత్తుతున్న భక్తులు

- 20 వ తేదీ నాటికే 8.81 కోట్ల మంది పుణ్య స్నానాలు
- ఫిబ్రవరి 26 వరకు కొనసాగనున్న మహా కుంభమేళా
- మొత్తం 45 రోజుల్లో 50 కోట్ల మంది వచ్చే అవకాశం
- మౌనీ అమావాస్య రోజు ఏకంగా 10 కోట్ల మంది జనాభా వస్తారని అంచనా


**నేషనల్ బ్యూరో :** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాలో త్రివేణి సంగమంలో స్నానాలు చేసేందుకు ప్రపంచం నలు మూలల నుంచి అంచనాలకు మించి భక్తులు తరలివస్తున్నారు. ఈ కుంభమేళా ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ ఎనిమిది రోజుల వ్యవధిలో దాదాపు 9 కోట్ల మంది త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ నెల 13వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ 8.81 కోట్ల మంది భక్తులు ప్రయాగ్‌రాజ్‌ను సందర్శించి పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు తాజాగా వెల్లడించారు. సోమవారం 1.65 కోట్ల మందికిపైగా పుష్య పూర్ణిమ స్నానాలు ఆచరించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత రెండో రోజైన మకర సంక్రాంతి రోజునే 3.5 కోట్ల మందికిపైగా వచ్చినట్లు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. మూడో రోజు కూడా కోటి మంది దాకా భక్తులు త్రివేణి సంగమానికి వచ్చారు. 20వ తేదీ (సోమవారం)న 54.96 లక్షల మంది భక్తులు త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు వెల్లడించారు. ఇక అత్యంత కీలకమైన మౌనీ అమావాస్య అయిన జనవరి 29న రానుంది. ఆ రోజు ఏకంగా 10 కోట్ల మంది కంటే అధికంగా భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తున్నది. ఈ నేపథ్యంలో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను సీఎం యోగీ ఆదిత్యనాథ్ ఆదేశించారు.

సంక్రాంతి రోజున ప్రారంభమైన (జనవరి 13) మహా కుంభమేళా ఫిబ్రవరి 26వ తేదీన మహాశివరాత్రితో ముగుస్తుంది. 45 రోజులపాటు సాగనున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరయ్యే భక్తుల సంఖ్య 50 కోట్లు దాటుతుందని యూపీ సర్కార్ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో కోట్లాది మందికి తగిన రీతిలో ఏర్పాటు చేసింది యూపీ ప్రభుత్వం. సుమారు లక్షా 60వేల టెంట్లను ఏర్పాటు చేశారు. లక్షా 50వేల టెయిలెట్లను నిర్మించారు. దాదాపు 15వేల మంది శానిటేసన్ వర్కర్లు పనిచేయనున్నారు. 1250కిలోమీటర్ల దూరం పైప్‌లైన్ వేశారు. 67 వేల ఎల్ఈడీ లైట్లు, రెండు వేల సోలార్ లైట్లు, మూడు లక్షల వృక్షాలను ఏర్పాటు చేశారు.

హెల్త్‌కేర్‌కు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. వంద బెడ్లతో సెంట్రల్ ఆస్పత్రిని సెటప్ చేశారు. రెండు 20 పడకల సబ్ సెంటర్ ఆస్పత్రులను, 25 ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక కుంభమేళా ప్రాంతంలో 125 అంబులెన్సులు అందుబాటో ఉంటాయి. రాయ్‌బరేలీలోని ఎయిమ్స్ వైద్యులు నిత్యం అందుబాటులో ఉంటారు. మత పరమైన అకాడాలకు కూడా ప్రత్యేక టెంట్లను కేటాయించారు.

# గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి

- దావోస్ లో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు
- సీఐఐ ఆధ్వర్యంలో గ్రీన్ ఇండస్ట్రియలైజేషన్ సదస్సులో ప్రసంగించిన చంద్రబాబు




**తెలంగాణ బ్యూరో :** ప్రపంచ దేశాలకు భారతీయులు పారిశ్రామిక రంగంలో అత్యుత్తమ సేవలు అందిస్తున్నారని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా సీఐఐ ఆధ్వర్యంలో గ్రీన్ ఇండస్ట్రియలైజేషన్‌పై నిర్వహించిన సదస్సులో సీఎం మాట్లాడారు. మీ అందర్నీ చూస్తుంటే నాలో నమ్మకం పెరిగింది. భవిష్యత్‌లో నా కలలు నిజమవుతాయనే నమ్మకం కలిగింది. రెండున్నర దశాబ్దాల్లో హైదరాబాద్ అభివృద్ధి చెందింది. భారత్‌లో అత్యంత నివాసయోగ్యమైన నగరంగా తీర్చిదిద్దడంలో ఎంతో కృషి చేశాం. అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం. 25 ఏళ్ల కిందట బిల్‌గేట్స్ ఐటీ సేవలను తీసుకొచ్చారు. 1991లో దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టారు. ఇంటర్నెట్, ఆర్థిక సంస్కరణలను వినియోగించి రెండో తరం సంస్కరణలను ప్రవేశపెట్టాను. 1999లో తొలిసారిగా విద్యుత్ సంస్కరణలు ప్రారంభమయ్యాయి. పాలనా వ్యవస్థలో ఉన్న వ్యక్తిగా ఆ సంస్కరణలు తీసుకువచ్చినందుకు ఎన్నికల్లో ఓడిపోయా. ఇప్పుడు ఆ విధానాలే ప్రజలకు అనుకూలంగా, అత్యుత్తమంగా మారిపోయాయి.

**సూర్యఘర్ కింద ఇంటింటికీ సౌరఫలకాలు**

2014లో మరోమారు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నాక సౌర విద్యుత్‌పై ఎక్కువ దృష్టి పెట్టాం. ఇప్పుడు ప్రధాన మంత్రి సూర్యఘర్ కింద ఇంటింటికీ సౌర ఉత్పత్తి చేయాలని ఓ విధాన నిర్ణయం ప్రకటించారు. సంప్రదాయేతర ఇంధన వనరుల్లో సౌర, పవన, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిపై ఎక్కువ దృష్టి పెట్టాం. అలాగే పంప్డ్ స్టోరేజీ ద్వారా హైడల్ విద్యుత్ ఉత్పత్తిపైనా ఏపీలో ఎక్కువ దృష్టి పెట్టాం. 115 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు ఇంధన వనరుల్లో వస్తున్నాయి. 500 మెగావాట్ల , 5 ఎంపీటీఏ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయబోతున్నాం.

# కలెక్టరేట్ లో సమావేశం.. ఫోన్ లో రమ్మీ గేమ్ ఆడిన డీఆర్ వో

- సోషల్ మీడియాలో వైరల్
- విచారణకు ఆదేశించిన కలెక్టర్



**ఏపీ బ్యూరో :** అనంతపురం జిల్లా రెవెన్యూ అధికారి మలోలా జిల్లా అధికారుల సమావేశం జరుగుతుండగా ఆన్‌లైన్‌లో రమ్మీ గేమ్ ఆడుతూ వీడియోకు చిక్కారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఎస్సీ వర్గీకరణపై ఏకసభ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజాన్ మిశ్రా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రెండు జిల్లాల కలెక్టర్లతో పాటు ఉన్నతాధికారులు హాజరయ్యారు. అయితే సమావేశం జరుగుతుండగానే జిల్లా రెవెన్యూ అధికారి మలోలా ఆన్‌లైన్‌లో రమ్మీ గేమ్ ఆడుతూ వీడియో కెమెరా కంటికి చిక్కారు. ఈ వీడియో క్షణాల్లోనే సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ విషయాన్ని తెలుసుకున్న అనంతపురం జిల్లా కలెక్టర్ డీఆర్‌వోపై సీరియస్ అయ్యారు.



## సైఫ్ అలీ ఖాన్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జి

**నేషనల్ బ్యూరో :** బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్(54) ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ఇంట్లో దొంగ చేతిలో నటుడు కత్తిపోట్లకు గురైన విషయం తెలిసిందే. ఇంట్లో దొంగను పట్టుకునే క్రమంలో సైఫ్ అలీ ఖాన్ ఆరు కత్తిపోట్లకు గురయ్యారు. మంగళవారం మధ్యాహ్నం ముంబై లీలావతి ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. సైఫ్ అలీ ఖాన్ తల్లి, భార్య కరీనా కపూర్, కుమార్తె సారా అలీ ఖాన్ సాయంతో ఇంటికి చేరారు. ఒక వారం పాటు పూర్తి బెడ్ రెస్ట్ తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఇన్ఫెక్షన్ రాకుండా ఉండేందుకు సందర్శకులను అనుమతించొద్దని వెల్లడించారు. సైఫ్ అలీ ఖాన్ ఇంటికి పోలీస్ అధికారుల బృందం వచ్చే అవకాశం ఉంది. సైఫ్ అలీ ఖాన్ స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసే ఛాన్సుంది. జనవరి 16న ఓ దుండగుడు అర్ధరాత్రి సైఫ్ అలీ ఖాన్ ఇంట్లోకి ప్రవేశించాడు. ఇంట్లో సిబ్బంది అలర్ట్‌తో అరవడంతో సైఫ్ అలీ ఖాన్ దొంగను పట్టుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో దొంగ కత్తితో పొడవడంతో సైఫ్ అలీ ఖాన్‌కు ఆరు కత్తిపోట్లు అయ్యాయి. వెంటనే లీలావతి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సైఫ్‌కు 5 గంటల పాటు ఆపరేషన్ చేశారు. రెండు గాయాలు లోతుగా ఉన్నట్లు గుర్తించారు. ఒక కత్తి ముక్కను కూడా బయటకు తీశారు. అయితే ఈ ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ముంబైలో భద్రత లేదంటూ విపక్షాలు విమర్శలు ఎక్కుపెట్టాయి. దీంతో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ స్పందిస్తూ.. ఒక్క ఘటనతో భద్రతపై విమర్శలు చేయడం సరికాదని.. దేశంలోనే ముంబై సేఫ్ ప్లేస్ అంటూ పేర్కొన్నారు.



# ఢిల్లీలో మరో మ్యానిఫెస్టో విడుదల చేసిన బీజేపీ

- కేజీ టు పీజీ ఉచిత విద్యనందిస్తామని హామీ

**నేషనల్ బ్యూరో :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సందర్భంగా బీజేపీ మరో మ్యానిఫెస్టోను విడుదల చేసింది. తాము అధికారంలోకి వస్తే నిరుపేద విద్యార్థులకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అమలుచేస్తామని వాగ్దానం చేసింది. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు రూ.15 వేల ఆర్థికసాయం అందజేస్తామని ప్రకటించింది. భీమ్‌రావ్ అంబేద్కర్ స్టైఫండ్ పథకం కింద ఐటీఐలు, పాలిటెక్నిక్ స్కిల్‌సెంటర్లలో టెక్నికల్ కోర్సులు అభ్యసిస్తున్న షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు ప్రతినెలా రూ.1,000 చొప్పున ఉపకార వేతనాలు అందజేస్తామని తెలిపింది. తాము అధికారంలోకి వస్తే.. ఆప్ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న అవినీతి, కుంభకోణాలపై దర్యాప్తు చేసేందుకు సిట్ ఏర్పాటుచేస్తామని ఈసందర్భంగా ఠాకూర్ వెల్లడించారు. ఈమేరకు 'సంకల్ప పత్రా' పార్ట్2ను భాజపా నేత అనురాగ్ ఠాకూర్ విడుదల చేశారు.

# జేపీ ప్రభాకర్ రెడ్డిపై సైబరాబాద్ సీపీకి ఫిర్యాదు

- తనను పరుష పదజాలంతో తిట్టాడని హీరోయిన్ మాధవీలత కంప్లైంట్



**ఏపీ బ్యూరో :** బీజేపీ నేత, సినీ నటి మాధవీలత, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మధ్య నెలకొన్న వివాదం మరింత ముదురుతోంది. తనను ప్రాస్టిట్యూట్ అంటూ పరుష పదజాలంతో దూషించిన జేసీ ప్రభాకర్ రెడ్డిపై ఇప్పటికే మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా), తెలుగు ఫిలిం ఛాంబర్‌కు మాధవీలత ఇప్పటికే ఫిర్యాదు చేశారు. తాజాగా జేసీ ప్రభాకర్ రెడ్డిపై సైబరాబాద్ సీపీకి కూడా ఫిర్యాదు చేశారు. జేసీపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# భావనపాడులో పెట్రో కెమికల్స్ హబ్ ఏర్పాటు..!

- దావోస్ లో ఏపీ మంత్రి నారా లోకేశ్
- ఉక్కు వ్యాపారి లక్ష్మి మిట్టల్ తో భేటీ



**తెలంగాణ బ్యూరో:** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ దావోస్ పర్యటనలో ఉక్కు దిగ్గజం లక్ష్మీ మిట్టల్‌తో భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ భావనపాడులో పెట్రో కెమికల్ హబ్ ఏర్పాటుకు పెట్టుబడులు పెట్టాలని, ఏపీలో సోలార్ సెల్ తయారు ప్లాంటు ఏర్పాటును పరిశీలించాలని లక్ష్మీ మిట్టల్‌ను మంత్రి లోకేశ్ కోరారు. పెట్రో కెమికల్స్ అన్వేషణకు భావనపాడు వ్యూహాత్మక ప్రాంతం అని మంత్రి లోకేశ్ లక్ష్మీ మిట్టల్‌కు తెలిపారు. ప్రణాళికాబద్ధమైన 83.3 ఎంటీపీఏ సామర్థ్యం గల పోర్టు, వైజాగ్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ కొలువై ఉండటం, స్థిరమైన మౌలిక సదుపాయాలు, బలమైన ప్రభుత్వం మద్దతు పెట్రో కెమికల్ రంగంలో పెట్టుబడులకు అనుకూలతలుగా ఉంటాయని మంత్రి వివరించారు. భావనపాడుమూలపేట ప్రాంతం తయారీ, ఆర్ అండ్ డీ, లాజిస్టిక్స్ సౌకర్యాలను నెలకొల్పడానికి.. పెట్రోకెమికల్స్, గ్రీన్ ఎనర్జీలో నూతన ఆవిష్కరణలకు అసమానమైన అవకాశాలు కలిగి ఉందని వివరించారు. ఈ ప్రాజెక్టును ఏపీలో ఏర్పాటు చేసేందుకు ఏపీఈడీబీ అధికారులతో కలిసి సైట్‌ను సందర్శించాలన్నారు. 2 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించే ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తామని మంత్రి లోకేష్ అన్నారు.

# బీజేపీ, ఆప్ మధ్య ముదిరిన మాటల యుద్ధం

- రావణాసురుడి వారసులే తొందరగా స్పందిస్తారు: మనీష్ సిసోడియా
- మనీశ్ వ్యాఖ్యలపై మండిపడ్డ బీజేపీ



**నేషనల్ బ్యూరో :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ అధికార, విపక్ష పార్టీలైన ఆప్ బీజేపీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో రామాయణంలో మాయ లేడీ లాంటి బీజేపీ నేతలను చూసి మోసపోవద్దని ఆప్ పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. తాజాగా ఆయన వ్యాఖ్యలపై స్పందించిన భాజపా నేతలను ఉద్దేశిస్తూ.. ఆప్ పార్టీ సీనియర్ నేత మనీశ్ సిసోదియా ఓ పోస్ట్ చేశారు. కేజ్రీవాల్ వ్యాఖ్యలకు రావణాసురుడి వారసులు వెంటనే స్పందించారంటూ ఎద్దేవా చేశారు. 'నిన్న కేజ్రీవాల్ ఓ బహిరంగ సభలో రావణుడికి సంబంధించిన వ్యాఖ్యలు చేశారు. రావణుడి వారసులు బీజేపీ నేతలను ఉద్దేశిస్తూ ఈ వ్యాఖ్యలపై తక్షణమే స్పందించారు. వారి అసలు ఉద్దేశం గ్రహించాలని ఢిల్లీ వాసులకు విజ్ఞప్తి చేస్తున్నా. వారు ఢిల్లీ ప్రజలకు రావణుడి కంటే పెద్ద ముప్పుగా మారతారు. వారితో జాగ్రత్తగా ఉండటం చాలా ముఖ్యం. వారి ఎజెండా అధికారాన్ని పొందడం, ప్రజల భూములను ఆక్రమించడం. జాగ్రత్తగా ఉండి..సరైన నిర్ణయాలు తీసుకోండి' అని సిసోదియా రాసుకొచ్చారు. ఈ మాటలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. కేజ్రీవాల్ సనాతన ధర్మాన్ని అవమానించారని, ఆయన రామచరితమానస్‌ను తప్పుగా అర్థం చేసుకున్నారని ఆ పార్టీ ఢిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ పేర్కొన్నారు.



## స్మార్ట్ మీటర్లు బిగించే ఉద్దేశం లేదు

**ఏపీ బ్యూరో :** రైతుల వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ఉద్దేశ్యం తమ ప్రభుత్వానికి లేదని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. అసెంబ్లీలో కూడా రైతులకు స్మార్ట్ బిగించటం లేదని చాలాసార్లు చెప్పామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల నుంచి తగ్గిస్తున్నామని ప్రచారం పెట్టారని, ఇందులో నిజం లేదన్నారు. కొంతమంది కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రానికి కొత్త ప్రాజెక్టులు వస్తున్నాయన్నారు. సీఎం చంద్రబాబును చూసి ఏపీలో కొత్త ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు పారిశ్రామిక వేత్తలు ఆసక్తి చూపిస్తున్నారని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం కొత్త ప్రాజెక్టులను తీసుకువస్తోంది. సీఎం చంద్రబాబును చూసి ఏపీలో కొత్త ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు పారిశ్రామిక వేత్తలు ఆసక్తి చూపిస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల పీఆర్సీ సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తాం. సీఎం నుంచి ఉద్యోగుల పీఆర్సీపై ఓ మంచి వార్తను వింటామని ఆశిస్తున్నాం.

# విశాఖ ఉక్కును కూటమి ప్రభుత్వం కాపాడింది

- 21 మంది ఏంపీలుండి వైసీపీ రాష్ట్రానికి ఒక్క మేలు చేయలేకపోయింది
- విశాఖ ఉక్కు కు రూ. 11 వేల కోట్ల నిధులు కేటాయించడం కూటమి ప్రభుత్వ విజయం
- మంత్రి కొలుసు పార్థసారథి


**ఏపీ బ్యూరో:** వైసీపీ హయాంలో ఆ పార్టీకి21 మంది ఎంపీలున్నా రాష్ట్రానికి ఒక్క మేలు చేయలేక పోయారని ఏపీ మంత్రి కొలుసు పార్థసారథి ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలను గాలికి వదిలేసి సొంత ప్రయోజనాల కోసం ఢిల్లీకి చక్కర్లు కొట్టారని మంగళవారం మీడియా సమావేశంలో విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 7 నెలల్లోనే కూటమి ప్రభుత్వం అద్భుత విజయాలు సాధించిందని వెల్లడించారు. ముఖ్యంగా విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడేందుకు కేంద్రం రూ. 11 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించడం కూటమి ప్రభుత్వం సాధించిన విజయాల్లో ఒకటని పేర్కొన్నారు. ఆంధ్రుల పోరాటంతో ఏర్పడిన విశాఖ ఉక్కు , దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందని అన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు, టీడీపీ, జనసేన, బీజేపీ, ప్లాంట్ కార్మికుల సుదీర్ఘ పోరాటాలు ఫలించాయని అన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టుల పూర్తికి కేంద్రంలోని ఎన్డీయే అన్ని విధాలా సిద్ధంగా ఉందని వివరించారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలతో పాటు ప్రధాన ప్రాజెక్టులను పూర్తి చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం వైపు పరుగులు పెట్టిస్తున్నామని స్పష్టం చేశారు.





# ఏ పొట్టను.. ఎలా తగ్గించుకోవాలి?

ఒత్తిడితో సతమతమైనా, శరీరంలో హార్మోన్ల అసమతుల్యత తలెత్తినా, డెలివరీ తర్వాత.. ఇలా వివిధ సందర్భాలలో పొట్ట పెరిగిపోవడం మనకు తెలిసిందే! పొట్ట చుట్టూ ఉండే అవయవాల్లో కొవ్వులు పేరుకుపోవడమే ఇందుకు కారణమంటున్నారు నిపుణులు. నిజానికి ఇలా పెరిగిపోయిన పొట్టంటే ఎవరికీ నచ్చదు.. వెంటనే దీన్ని తగ్గించుకొని తిరిగి నాజూకైన నడుమును సొంతం చేసుకోవాలని ఆరాటపడుతుంటారు. అయితే ఒకరకంగా ఈ ఆలోచన మంచిదే అంటున్నారు నిపుణులు. ఎందుకంటే పొట్ట చుట్టూ పేరుకుపోయిన చెడు కొవ్వు ఎప్పటికైనా ఆరోగ్యానికి హానికరమే అంటున్నారు నిపుణులు. అందుకే దీన్ని ఎంత త్వరగా తగ్గించుకుంటే అంత మంచిదంటున్నారు. అంతేకాదు.. ఏ పొట్టను ఎలా తగ్గించుకోవాలో వివరిస్తూ కొన్ని చిట్కాలు సైతం సూచిస్తున్నారు.



### ప్రసవానంతర పొట్టా?!

డెలివరీ అయ్యాక కూడా పొట్ట ఎత్తుగా కనిపించడం సహజమే! అయినా దీన్ని అంగీకరించడానికి చాలామంది మహిళలు ఇష్టపడరు. ఈ క్రమంలో వెనువెంటనే పొట్ట తగ్గించుకొని తిరిగి నాజుగ్గా మారాలని ఆరాటపడుతుంటారు. ఒత్తిడికీ గురవుతుంటారు. దీనివల్ల ఆరోగ్యానికి నష్టం తప్ప మరే ప్రయోజనం ఉండదు. అందుకే ఒత్తిడికి లోనవకుండా, చక్కటి జీవనశైలిని పాటిస్తే కొన్ని రోజుల్లోనే మార్పు గమనించచ్చంటున్నారు నిపుణులు.

ఈ క్రమంలో ప్రసవం అయ్యాక ఆరు నుంచి ఎనిమిది వారాల తర్వాత గైనకాలజిస్ట్ సలహా మేరకు చిన్న చిన్న వ్యాయామాలు మొదలుపెట్టచ్చు. ఈ క్రమంలో నడక, పాపాయిని ఎత్తుకొని కాసేపు అటూ ఇటూ నడవడం, యోగా, ధ్యానం.. ఇలా కుట్లపై ఒత్తిడి పడని వ్యాయామాల్ని సాధన చేయచ్చు. అలాగే కీగల్ వ్యాయామాలు కూడా వదులైన చర్మం బిగుతుగా మారడానికి దోహదం చేస్తాయి. ఇక ఆహారం విషయానికొస్తే.. నట్స్, డ్రైఫ్రూట్స్, ఆలివ్ నూనె, అవకాడో.. వంటి మంచి కొవ్వుల్ని తీసుకోవాలి. నిపుణుల సలహా మేరకు పోస్ట్ పార్టమ్ స్లిమ్మింగ్ బెల్ట్, చీర చుట్టుకోవడం.. వంటివి ప్రయత్నించచ్చు.

### కూర్చొని తింటే లావైపోరూ!

కొంతమందికి శరీర పైభాగం స్లిమ్‌గా ఉంటుంది.. అదే పొట్ట దగ్గరికొచ్చేసరికి కాస్త లావుగా కనిపిస్తుంది..

ఇందుకు రెండు కారణాలుండచ్చంటున్నారు నిపుణులు. మొదటిది ఎక్కువ సేపు కూర్చొని పనిచేయడం, శారీరక శ్రమ లేకపోవడం, జంక్‌ఫుడ్‌ప్రాసెస్డ్ ఫుడ్‌కు అలవాటు పడడం.. వంటి వాటి వల్ల పొట్ట చుట్టూ కొవ్వులు పేరుకుపోతాయి. ఇక రెండోది జీర్ణ సంబంధిత సమస్యలు, గ్యాస్ట్రిక్ సమస్యల వల్ల ఎప్పుడు చూసినా పొట్ట ఉబ్బరంగా కనిపిస్తుంటుంది. మరి, ఇలాంటి పొట్టను తగ్గించుకోవాలంటే.. పీచు అధికంగా ఉండే బీన్స్, బ్రకలీ, బెర్రీ పండ్లు, అవకాడో, యాపిల్, తృణధాన్యాలు, డ్రైఫ్రూట్స్.. వంటివి ఎక్కువగా తీసుకోవాలి. ఇందులోని ఫైబర్.. తీసుకున్న ఆహారం సులభంగా జీర్ణమయ్యేలా చేస్తుంది. ఇక నీళ్లు ఎక్కువగా తాగడం, నీటి శాతం అధికంగా ఉండే పండ్లు, కాయగూరలు తీసుకున్నా ఫలితం ఉంటుంది. వీటితో పాటు పొట్టపై ఒత్తిడి పడే కోర్ వ్యాయామాలు, బరువులెత్తడం, మెట్లెక్కడం.. వంటివి సాధన చేయచ్చు. తద్వారా పొట్ట చుట్టూ పేరుకున్న కొవ్వు కరగడంతో పాటు అక్కడి కండరాలు కూడా దృఢమవుతాయి.

### ఒత్తిడి వల్ల..

మన ఆహారపుటలవాట్లు, జీవనశైలి మార్పులు శరీరంలో హార్మోన్లపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. తద్వారా హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. అలాగే మనసులో కలిగే ఆందోళనలు ఒత్తిడి వల్ల.. ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్ స్థాయులు కూడా పెరిగిపోతాయి. పొట్ట ఎత్తుగా కనిపించడానికి ఇది కూడా కారణమే అంటున్నారు నిపుణులు. మరి, ఈ సమస్య నుంచి విముక్తి పొందాలంటే ఒత్తిడి తగ్గించుకోవడంతో పాటు జీవనశైలి మార్పులు అవసరం అంటున్నారు.

ఇందుకోసం.. యోగా, ధ్యానం.. వంటివి సహకరిస్తాయి. ఇవి సాధన చేయడం వల్ల రాత్రుళ్లు నిద్ర కూడా చక్కగా పడుతుంది.. ఫలితంగా శరీరం పునరుత్తేజితం అవుతుంది. అలాగే అనారోగ్యకరమైన కొవ్వులు నిండి ఉండే జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్, నూనె సంబంధిత పదార్థాలను దూరం పెట్టి.. ఆరోగ్యకరమైన కొవ్వులు నిండి ఉన్న చేపలు, నట్స్, డ్రైఫ్రూట్స్.. వంటివి తీసుకోవాలి. ఇక వీటితో పాటు బరువు ఎక్కువగా ఉన్న వారు, స్థూలకాయుల్లో కూడా పొట్ట లావుగానే ఉంటుంది. కాబట్టి పొట్ట పెరిగిపోవడానికి కారణమేదైనా సరే.. ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లు పాటించడం, తీసుకునే ఆహారంలో చక్కెర తగ్గించడం, వ్యాయామాలు చేయడం.. వంటివి రోజువారీ అలవాట్లుగా మార్చుకుంటే సమస్య నుంచి త్వరగా విముక్తి పొందచ్చు.. ఆరోగ్యంగానూ ఉండచ్చు..!



## ఫిబ్రవరి 2 నుంచి సందర్శకులకు స్వాగతం పలకనున్న

# రాష్ట్రపతి భవన్ లోని పూలతోట

* రాష్ట్రపతి భవన్ లో అందమైన పూల చెట్లతో కూడిన అమృత్ ఉద్యాన్
* ఫిబ్రవరి 2 నుంచి మార్చి 30 వరకు సందర్శకులకు అనుమతి
* ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సందర్శన

దేశ రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ లో కొలువైన అందమైన పూలతోట అమృత్ ఉద్యాన్ ఫిబ్రవరి 2 నుంచి సందర్శకులకు స్వాగతం పలకనుంది. ఈ మేరకు రాష్ట్రపతిభవన్ నుంచి ఓ ప్రకటన వెలువడింది. అమృత్ ఉద్యాన్ ను సందర్శించేందుకు ఫిబ్రవరి 2 నుంచి మార్చి 30వ తేదీ వరకు అనుమతిస్తామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. వారంలో ఆరు రోజుల పాటు సందర్శించవచ్చని, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య సందర్శకులు రావొచ్చని వివరించారు. రాష్ట్రపతి భవన్ లో 15 ఎకరాల్లో ఈ సుందరమైన పూదోట ఉంటుంది. ఇందులో కోలియస్, సెలోషియా, ట్యూబరోస్ తదితర అనే రకాల పూల మొక్కలు, అరుదైన మొక్కలు ఉంటాయి. వీటిలో శీతాకాలంలో పుష్పించే కొన్ని మొక్కలతో ప్రస్తుతం అమృత్ ఉద్యాన్ కనులవిందు చేస్తోంది. కాగా, ఈ గార్డెన్ ను సందర్శించే ప్రజల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. సెంట్రల్ సెక్రటేరియట్ మెట్రో స్టేషన్ నుంచి గేట్ నెం.35 వరకు ప్రతి 30 నిమిషాలకు బస్సు సర్వీసులు నడుస్తాయి. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ షటిల్ బస్ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. కాగా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి 5వ తేదీ నాడు అమృత్ ఉద్యాన్ మూసి ఉంచుతారు. ఆ రోజున సందర్శకులను అనుమతించరు. ఫిబ్రవరి 20, 21న రాష్ట్రపతి భవన్ లో సందర్శకుల సమావేశం కారణంగా ఉద్యానవనం మూసి ఉంచుతారు. మార్చి 14న హోలీ పండుగ సందర్భంగా కూడా ఈ గార్డెన్ ను సందర్శించేందుకు అనుమతించరు.
















# హీరో యశ్ చిత్రం 'టాక్సిక్' షూటింగ్ కు బ్రేక్ పడనుందా

యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్ దాస్ టాక్సిక్ చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఆ మధ్య పీన్యా అటవీ ప్రాంతంలో వేలాది చెట్లు నరికివేతకు గురి కావడంతో టాక్సిక్ సంచలనమైంది. చెట్లను నరికేసి షూటింగ్ నిర్వహించడంపై అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే సీరియస్ అయ్యారు. చట్టపరమైన చర్యలకు దిగారు. రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో అనుమతులు లేకుండా చెట్లను నరికి చదును చేసుకుని షూటింగ్ నిర్వహించడానికి అనుమతులు ఎలా అంటూ ఆరాలు మొదలవ్వడగా హిందుస్తాన్ మెషిన్ టూల్స్ సంస్థ నుంచి తమకు అనుమతులు వచ్చినట్లు...ఆ సంస్థ ఆధ్వర్యంలో అటవీ ప్రాంతం ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. అప్పటి నుంచి ఈ వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా నిర్మాతలకు ప్రభుత్వం తరుపున నోటీస్ వెళ్లినట్లు సమాచారం.దీంతో హిందుస్తాన్ మెషీన్ టూల్స్ తో పాటు నిర్మాతలు కూడా విచారణకు హాజరు కావాల్సి ఉంటుంది. క్యాబినెట్ ఆమెదం లేకుండా డీనోటిఫికేషన్ అప్రూవ్ చేసుకోవడాన్ని సవాల్ చేస్తూ ఈ వివాదం కోర్టుకు వెళ్లింది. దీంతో ఈ వివాదానికి ఇప్పట్లో ఫుల్ స్టాప్ పడేలా కనిపించలేదు. త్వరలో షూటింగ్ కూడా ఆపేసేలా కోర్టు నుంచి ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉందంటున్నారు. అదే జరిగితే టాక్సిక్ పెద్ద నష్టమే.

ప్రత్యామ్నాయంగా అలాంటి లోకేషన్ వెతుక్కుని కొత్తగా అక్కడ షూటింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. అదంతా అప్పటికప్పుడు జరిగే పని కూడా కాదు. నెల ..రెండు నెలలు సమయం పట్టే అవకాశం ఉంటుంది. మరోవైపు ఈ చిత్రాన్ని డిసెంబర్ లో రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ వివాదం నేపథ్యంలో షూటింగ్ అనుకున్న టైమ్ లో పూర్తి చేయడం సాధ్యం అయ్యేది కాదు. మరి కోర్టు షూటింగ్ కి అక్కడ అనుమతిస్తుందా? నేరంగా పరిగణిస్తుందా? అన్నది చూడాలి.సరిగ్గా ఇలాంటి వివాదంలో` కాంతార 2` కూడా ఎదుర్కుంటుంది.` కాంతార` ప్రీక్వెల్ షూటింగ్ షూటింగ్ కర్ణాటకలోని గవిగుడ్డ సమీపంలో జరుగుతుంది. అయితే ఈ షూటింగ్ పై స్థానికుల నుండి వ్యతిరేకత తీవ్ర స్థాయిలో వచ్చింది. అనుమతి లేకుండా అటవీ ప్రాంతంలో చిత్రీకరణ, వన్యప్రాణులకు ఆటంకం కలిగించడం వంటి పర్యావరణ నిబంధనల ఉల్లంఘన చేస్తున్నారంటూ స్థానికులు మండిపడుతున్నారు. దీంతో కాంతార షూటింగ్ పై స్థానిక సామాజిక సంస్థలు, మాజీ జిల్లా పంచాయతీ సభ్యుడు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశాడు. నిబంధనలు ఉల్లంఘించి షూటింగ్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం వివరణ కోరింది.

# దిల్ రాజు బ్యాంక్ లాకర్స్ ఓపెన్ : భార్య తేజస్విని



దిల్ రాజు భార్య తేజస్విని బ్యాంక్ లాకర్లను ఐటీ అధికారుల ముందు ఓపెన్ చేయడం సంచలనం రేపింది. ఈ సందర్భంగా తేజస్విని మీడియాతో మాట్లాడుతూ, 'రెగ్యులర్ చెకప్‌లో భాగంగానే ఐటీ అధికారులు వచ్చారు. వారు అడిగిన వివరాల ప్రకారం బ్యాంక్ లాకర్లను చూపించాం," అని స్పష్టం చేశారు. ఈ వివరణతో దిల్ రాజు కుటుంబం సైలెంట్ గానే కనిపిస్తున్నా, సినీ వర్గాల్లో ఈ పరిణామం చర్చనీయాంశంగా మారింది.

ఇదే సమయంలో, ఎన్టీఆర్‌కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందిన పాన్ ఇండియా సినిమా దేవర ఫైనాన్సర్ సత్య రంగయ్య ఇంట్లో కూడా ఐటీ దాడులు జరుగుతున్నాయి. వందల కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై ఐటీ అధికారులు దృష్టి పెట్టారు. పాన్ ఇండియా సినిమాలకు భారీ బడ్జెట్‌లు ఎలా వస్తున్నాయి? పన్నులు సక్రమంగా చెల్లిస్తున్నారా? ఫైనాన్షియర్లకు చెల్లింపులు ఎలా జరుగుతున్నాయి? వంటి అంశాలపై వారు సోదాలు కొనసాగిస్తున్నారు.

దిల్ రాజు, మైత్రి మూవీ మేకర్స్, దేవర ఫైనాన్షియర్ ఇళ్లలో సోదాలు జరగడం వల్ల సినీ పరిశ్రమలో పెద్ద దుమారం రేగింది. పుష్ప 2, సంక్రాంతికి వస్తున్నాం వంటి భారీ హిట్ల నిర్మాణ సంస్థలపై ఐటీ దాడులు జరగడం, వీటిలో నమోదైన భారీ వసూళ్లు అందరి దృష్టిని ఆకర్షించాయి. ఈ సోదాలు నిర్మాతల పన్ను చెల్లింపులు, ఫైనాన్షియర్లకు జరిగిన చెల్లింపులపై ఫోకస్ పడేలా చేస్తాయా? లేదా అన్నది ఆసక్తిగా మారింది.

ఐటీ సోదాలు సినీ వర్గాల్లో ఆందోళనకు కారణమవుతున్నాయి. ప్రత్యేకంగా పాన్ ఇండియా చిత్రాలకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాలు, బడ్జెట్ నిర్వహణపై అధికారులు సోదాలు నిర్వహించడం పరిశ్రమలో పన్ను కట్టే విధానాలపై ప్రశ్నలు తలెత్తేలా చేసింది. ఈ దాడులు సినీ పరిశ్రమలో పారదర్శకతను పెంపొందిస్తాయా? అన్నది ఆసక్తికరంగా మారింది.

ఈ సోదాల తరువాత టాలీవుడ్‌లో భారీ బడ్జెట్ చిత్రాల నిర్మాణం, డిస్ట్రిబ్యూషన్, ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్స్ అంశాల్లో మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉందని సినీ పరిశ్రమ విశ్లేషకులు భావిస్తున్నారు. మరి ఈ ఐటీ దాడులు ఇంకా ఎంతవరకు

# నాగ చైతన్య రూ. '100'కోట్ల మూవీ ఎప్పుడు స్టార్ట్ అంటే...



యువ సామ్రాట్ నాగచైతన్య నటిస్తోన్న 'తండేల్' భారీ అంచనాల మధ్య పాన్ ఇండియాలో రిలీజ్ అవుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా రిలీజ్ అనంతరం నాగచైతన్య కార్తీక్ దండు ప్రాజెక్ట్ ని పట్టాలె క్కించనున్నారు. 'విరూపాక్ష' తర్వాత కార్తీక్ దండు చైతన్య సినిమా కోసమే నిమగ్నమై పనిచేసాడు. ఇతర హీరోలతో అవకాశాలొచ్చినా? ఆ ఛాన్స్ తీసుకోకుండా చైతన్య స్క్రిప్ట్ పేనే రేయింబవళ్లు శ్రమించాడు. ఇది కూడా ఓ థ్రిల్లర్ కథాశం. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ కి సంబంధించి ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి.

నటీనటులు, సాంకేతిక నిపుణుల్ని ఎంపిక చేస్తున్నారు. ఇంకా చైతన్యకి హీరోయిన్ ఎవరు? అన్నది ఫిక్స్ అవ్వలేదు. స్టార్ హీరోయిన్ల పేర్లు వినిపిస్తున్నా? ఇంకా ఖరారు కాలేదు. శ్రీలీల, మీనాక్షి చౌదరిలో ఎవరో ఒకరికి ఆ ఛాన్స్ దక్కుతుందనే బలమైన ప్రచారం జరుగుతోంది. అయితే ప్రతి నాయకుడిగా మాత్రం బాలీవుడ్ ని నటుడిని తెరపైకి తెస్తున్నారు.

స్పర్ష్ శ్రీవాత్సవ ని సీన్ లోకి తెస్తున్నారు. 'బాలికా వధు' సీరియల్ తో నార్త్ లో ఫేమస్ అయ్యాడు. అటుపై 'లాపతా లేడీస్' లోనూ నటించాడు. ఈ రెండు అతడికి మంచి గుర్తింపును తీసుకొచ్చాయి.

దీంతో విలన్ పాత్రకు స్పర్ష్ శ్రీవాత్సవ్ పర్ఫెక్ట్ గా సూటవుతున్నాడుట. త్వరలో లుక్ టెస్ట్ నిర్వహించనున్నారుట.

ఈ నేపథ్యంలో దర్శకుడి ఛాయిస్ గా మారినట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు 'వృషకర్మ' అనే టైటిల్ పరిశీలనలో ఉంది. అలాగే ఈ చిత్రాన్ని 100 కోట్ల బడ్జెట్ తో నిర్మించడానికి సన్నాహకాలు జరుగుతున్నాయుట.




# ఆ విషయంలో ఎక్కువ భయపడతాను : హీరో మాధవన్



పాన్ ఇండియా లెవల్‌లో సినిమాలు చేస్తున్నా.. ఎక్కడా పాన్ ఇండియా స్టార్ అనే ముద్ర పడని నటుడు మాధవన్. రీసెంట్‌గా ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అందులో ఆయన తన భయాల గురించి చెప్పారు. ఇప్పుడు 'హిసాబ్ బరాబర్' అనే సినిమా రెడీ చేశారు. జీ 5లో ఈ విడుదలకు రెడీగా ఉంది. ఈ నేపథ్యంలో ఆయన మీడియా ముందుకొచ్చి ఆసక్తికర విషయాలు పంచుకుంటున్నారు. అలా తన కెరీర్ గురించి కూడా చెప్పారు. మరికొన్ని గంటల్లో తన సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోందంటే భయాందోళనకు గురవుతానని చెప్పారాయన.కెరీర్‌లో రెండే క్షణాలు నరాలు తెగేంత ఉత్కంఠ కలిగిస్తాయని చెప్పారు మాధవన్. కొత్త సినిమా సెట్‌లో అడుగుపెట్టిన మొదటి రోజు, ఆ సినిమా విడుదల మొదటి రోజు ఆందోళన కలుగుతుంది అని చెప్పారు. సినిమా ఆశించిన స్థాయిలో లేకపోతే 'నీ గేమ్ ఓవర్' అని ప్రేక్షకులు, పరిశ్రమ జనాలు అంటారేమోనని భయపడతాను అని మాధవన్ తన ఆలోచనల గురించి పంచుకున్నారు. అలా పరిశ్రమలో 25 ఏళ్లుగా కొనసాగడం సులభం కాదు అని చెప్పారు.ఈ విషయంలో తాను అదృష్టవంతుడినని, తనను ఎంతోమంది ప్రేక్షకులు ఇప్పటికీ ఆదరిస్తున్నారని వారందరికీ కృతజ్ఞతలు అని చెప్పారాయన. కొన్ని కథలు ఎనిమిది ఎపిసోడ్‌లంత పెద్దవిగా ఉంటున్నాయి. వాటిని తగ్గించి థియేటర్‌లో విడుదల చేయలేం కదా.. ఓటీటీలే ఆ విషయంలో బెస్ట్. అలాగే కొన్ని కథలు థియేటర్లలో జనాలు చూసేంత సగటు నిడివితో తీయలేం. 'హిసాబ్ బరాబర్'ను కూడా అలాంటి కథే. అందుకే ఓటీటీలో విడుదల చేస్తున్నాం అని చెప్పారు. అశ్వినీధీర్ తెరకెక్కించిన 'హిసాబ్ బరాబర్' జనవరి 24 నుండి స్ట్రీమింగ్‌కి వస్తుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.